ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
సోమవారం 27 జులై 2026 | సంపుటి: 1 సంచిక: 40 | పేజీలు 12 | వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై
## హూతీల దాడి

### చమురు ఉత్పత్తిపై ఎఫెక్ట్
ఓ వైపు అమెరికా–ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతుంటే మరోవైపు సౌదీ అరేబియా–హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులు ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇరాన్ మద్దతు గల హూతీ తిరుగుబాటుదారులు ఎర్రసముద్రంలో దిగ్బంధనాన్ని ప్రకటించారు.

2

- రియాద్ (సింగిడి)


కరిగిపోతున్న ఎయిర్ డిఫెన్స్
## క్షిపణుల నిల్వలు
ఇరాన్‌పై దాడుల విషయంలో వెనక్కితగ్గిన అమెరికా
ఆందోళనలో ట్రంప్
2

# ఇక సులభంగా.. మల్లన్న దర్శనం
### కొమురవెల్లిలో నూతన రైల్వే స్టేషన్ ప్రారంభించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్
మరో ₹80 కోట్లతో ప్లాట్‌ఫారమ్ విస్తరణ
₹300 కోట్లతో రైల్వే లైన్ విద్యుతీకరణ"
"మల్లన్న సన్నిధికి ప్రగతి బాట
రైలు కూతతో మారిన కొమురవెల్లి ముఖచిత్రం"

**కొమురవెల్లి, జూలై 26 (సింగిడి):**
కొమురవెల్లి: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్‌ను కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని చెప్పారు.

**తీరనున్న భక్తుల ఇబ్బందులు**
మల్లన్న భక్తులు కొమురవెల్లి చేరుకునేందుకు ...మిగతా 2లో

యువ శక్తి ముందు కేంద్ర ప్రభుత్వం
# ఓడిపోయింది
శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వయోపరిమితి 21కి తగ్గించాలని రేవంత్ డిమాండ్
21 ఏళ్లకే ఐఏఎస్, మేయర్లు అవుతున్నప్పుడు ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదని ప్రశ్న
ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్న సీఎం
గుజరాత్‌లాగే తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి

2
యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- హైదరాబాద్, జులై 26 (సింగిడి)


నందన్ నీలేకని నేతృత్వంలో 2
# హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్
### పరీక్షల సంస్కరణ కోసం మోదీ కీలక నిర్ణయం
విశ్వసనీయ, పారదర్శక వ్యవస్థ ఏర్పాటు లక్ష్యమని ప్రకటించిన ప్రధాని
ఈ టాస్క్‌ఫోర్స్ నివేదిక ఆధారంగా భవిష్యత్ చర్యలు ఉంటాయని వెల్లడి

దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, పేపర్ లీక్‌ల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆధార్ రూపశిల్పిగా పేరుగాంచిన నందన్ నీలేకని నేతృత్వంలో ఒక హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రకటించారు.
- న్యూఢిల్లీ (సింగిడి)


రక్షణ ఎగుమతుల్లో
## కొత్త శిఖరాలకు భారత్
కార్గిల్ వార్‌లో దేశ సైనికులు వీరోచితంగా పోరాడారని కితాబు
మన్ కీ బాత్‌లో మోదీ ప్రసంగం
2

విద్యా శాఖ మంత్రిగా రేవంత్
## రాజీనామా చేయాలి

రామచందర్ రావు
**హైదరాబాద్, జులై 26 (సింగిడి):**
ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖ మంత్రిగా రాజీనామా చేయాలని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ తివోలి గార్డెన్స్‌లో ఎంపీ ఈటలతో కలసి కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు.

కోచింగ్ సంస్థల్లో...
# కలల ఖరీదు
### ప్రకటనలు ఒకవైపు... వాస్తవాలు మరోవైపు
ర్యాంకుల వెనుక అసలు గణాంకాలు

**ఫీజుల ప్రవాహం... కోట్ల వ్యాపారం**
భారత ప్రభుత్వ పన్ను వసూళ్లు, అంతర్జాతీయ మార్కెట్ రీసెర్చ్ సంస్థల అంచనాల ప్రకారం 2026లో భారతదేశంలోని ప్రైవేట్, కార్పొరేట్ కోచింగ్ ఇండస్ట్రీ టర్నోవర్ సుమారు రూ.58 వేల కోట్లు. ట్యూషన్లు, నీట్, జేఈఈ, యూపీఎస్సీ, ఇతర ప్రవేశ పరీక్షల కోచింగ్ అన్నీ కలిపి ఈ స్థాయి వ్యాపారం జరుగుతోంది. ఒక్కో విద్యార్థి సగటు వార్షిక ఫీజు రూ.1.25 లక్షలుగా తీసుకుంటే... 58,000 కోట్లు డివైడెడ్ బై 1.25 లక్షలు ఈక్వల్స్ టు దాదాపు 46.4 లక్షల మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం ఈ కోచింగ్ వ్యవస్థలో శిక్షణ పొందుతున్నట్లు అంచనా.



**లక్షల్లో విద్యార్థులు... సీట్లలో నిజం**
ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు కోచింగ్ తీసుకుంటున్నప్పటికీ... టాప్ విద్యాసంస్థల్లో అవకాశాలు మాత్రం చాలా పరిమితంగా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించే ప్రభుత్వ సంస్థలు విడుదల చేసే అధికారిక గణాంకాలు పరిశీలిస్తే... సీట్ల సంఖ్య, పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య మధ్య భారీ అంతరం కనిపిస్తోంది. ఈ అంతరమే కోచింగ్ ఇండస్ట్రీ అసలు చిత్రాన్ని చూపిస్తోంది.

**నీట్ లెక్కలు... 97 మందికి నిరాశ**
ప్రతి సంవత్సరం 23 నుంచి 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తున్నారు. కానీ దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉన్న ఎంబీబీఎస్ సీట్లు 56 వేల నుంచి 60 వేల వరకు మాత్రమే. లెక్క ప్రకారం... 60,000 డివైడెడ్ బై 24,00,000 మల్టిప్లికేషన్ 100 ఈక్వల్స్ టు 2.5 శాతం. అంటే ప్రతి 100 మంది విద్యార్థుల్లో కేవలం ఇద్దరు లేదా ముగ్గురికి మాత్రమే ప్రభుత్వ మెడికల్ సీటు దక్కుతోంది. మిగిలిన 97.5 శాతం మంది ప్రభుత్వ వైద్య విద్యకు దూరమవుతున్నారు.

**ఐఐటీ కలలు... ఒక్క శాతం ఫలితం**
ఇంజినీరింగ్‌లో అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీల్లో ప్రవేశం కోసం ప్రతి సంవత్సరం సుమారు 14 లక్షల మంది జేఈఈ మెయిన్స్ పరీక్ష రాస్తున్నారు. దేశంలోని మొత్తం 23 ఐఐటీల్లో కలిపి కేవలం 17,500 సీట్లు మాత్రమే ఉన్నాయి. లెక్కిస్తే... 17,500 డివైడెడ్ బై 14,00,000 మల్టిప్లికేషన్ 100 ఈక్వల్స్ టు 1.25 శాతం. అంటే వంద మంది కోచింగ్ తీసుకుంటే... ఒక్కరికే ఐఐటీ అవకాశం, మిగిలిన 99 మంది ఆ లక్ష్యాన్ని అందుకోలేకపోతున్నారు.

**యూపీఎస్సీ పోటీ... వెయ్యిలో ఒకరు**
దేశ అత్యున్నత సివిల్ సర్వీసెస్ కోసం నిర్వహించే యూపీఎస్సీ పరీక్షకు ప్రతి సంవత్సరం 11 నుంచి 13 లక్షల మంది దరఖాస్తు చేస్తారు. కానీ నియామకాలు మాత్రం వెయ్యిలోపే ఉంటాయి. లెక్క ప్రకారం... 1,000 డివైడెడ్ బై 12,00,000 మల్టిప్లికేషన్ 100 ఈక్వల్స్ టు 0.08 శాతం. అంటే వంద మందిలో కాదు... వెయ్యి మందిలో కూడా ఒక్కరికే అవకాశం దక్కుతోంది.

## రూ.58 వేల కోట్ల కోచింగ్ వ్యాపారం
### వందలో ఇద్దరికే టాప్ సీట్లు
**దేశంలో డాక్టర్, ఇంజనీర్, ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు కార్పొరేట్ కోచింగ్ సంస్థల్లో చేరుతున్నారు. వేల కోట్ల రూపాయల ఫీజులు చెల్లిస్తున్నారు. అయితే ఈ భారీ విద్యా వ్యాపారం ద్వారా టాప్ కాలేజీల్లో సీట్లు సాధిస్తున్న వారి సంఖ్య ఎంత? అధికారిక గణాంకాలు, మార్కెట్ అంచనాలు, సీట్ల లెక్కలు, ఫీజుల గణితం పరిశీలిస్తే... ఈ రూ.58 వేల కోట్ల కోచింగ్ వ్యవస్థలో విజయం సాధిస్తున్నది కేవలం ఒకటి నుంచి రెండు శాతం మంది మాత్రమేననే వాస్తవం స్పష్టమవుతోంది.**
- న్యూఢిల్లీ ప్రతినిధి, జూలై 26 (సింగిడి)

**ర్యాంకుల ప్రచారం... దాగిన గణితం**
కార్పొరేట్ కోచింగ్ సంస్థలు మా సంస్థ నుంచి 10 వేల మందికి ఐఐటీ సీట్లు, వేలాది నీట్ ర్యాంకులు అంటూ భారీ ప్రకటనలు ఇస్తుంటాయి. అయితే ఆ 10 వేల మంది విజయాల వెనుక... ఆ సంస్థలో మొత్తం ఎంత మంది చదివారన్న ప్రశ్నకు సమాధానం కనిపించదు. ఉదాహరణకు... ఒక సంస్థలో 5 లక్షల మంది విద్యార్థులు చేరి, వారిలో 10 వేల మందికి మాత్రమే టాప్ సీట్లు వస్తే... 10,000 డివైడెడ్ బై 5,00,000 మల్టిప్లికేషన్ 100 ఈక్వల్స్ టు కేవలం 2 శాతం విజయశాతం మాత్రమే. అంటే ప్రచారంలో కనిపించేది విజయమే... కానీ 98 శాతం మంది పరాజయం ఎక్కడా కనిపించదు.

**46 లక్షల ఫీజులు... ఇద్దరికే ఫలితం**
రూ.58 వేల కోట్ల వ్యాపారం ఆధారంగా అంచనా వేసిన 46 లక్షల మంది విద్యార్థుల్లో ఒకటి నుంచి రెండు శాతం మంది మాత్రమే టాప్ కాలేజీల్లో సీట్లు సాధిస్తున్నారు. అంటే 46 వేల నుంచి 92 వేల మంది మాత్రమే అత్యున్నత ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడుగు పెడుతున్నారు. మిగిలిన లక్షలాది మంది విద్యార్థులు చెల్లించిన ఫీజులు... కష్టపడ్డ సంవత్సరాలు... ఆశలు... అన్నీ పోటీ తీవ్రత ముందు నిలబడలేకపోతున్నాయి.

**కుటుంబాలకు లాభం... యాజమాన్యాలకు లాభం**
ప్రభుత్వ మెడికల్ లేదా ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు ప్రైవేట్ కాలేజీల్లో చెల్లించాల్సిన భారీ ఫీజులను తప్పించుకుంటారు. మెడికల్‌లో ఒక్కో సీటుకు రూ.60 లక్షల నుంచి రూ.1 కోటి, ఇంజినీరింగ్‌లో రూ.15 నుంచి రూ.20 లక్షలు వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. దీంతో టాప్ విద్యార్థుల కుటుంబాలకు మొత్తం మీద రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు విద్యా ఖర్చు ఆదా అవుతుందని ...మిగతా 2లో

మాజీ మంత్రి రోజాకు
## నోటీసులు
30న విచారణకు హాజరుకావాలని ఆదేశం
2

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత ఆర్కే రోజాకు తిరుపతి ఈస్ట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా నగరిలో రోజాకు ఈ నోటీసులు అందజేసిన పోలీసులు.. ఈ నెల 30వ తేదీన విచారణకు హాజరుకావాలని అందులో ఆదేశించారు.
- తిరుపతి (సింగిడి)

# నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం
కూటమి పాలనకు రెండేళ్లు
నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
45 రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచారం
ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని నేతలకు ఆదేశం

**విజయవాడ, జులై 26 (సింగిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపటి నుంచి (సోమవారం) 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం, ఘోర తప్పిదాల వల్లే ...మిగతా 2లో

## ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను
రాజకీయాలు అవినీతిమయం: సిద్ధరామయ్య
2

## శ్రీరాంసాగర్‌లో విషాదం
ముప్కాల్ వద్ద బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లి నలుగురు మృతి


ప్రైవేటు కంపెనీలను విచారించే పరిధి
## హెచ్‌ఆర్సీకి లేదు
ప్రైవేటు కంపెనీలు, వాటి ఉద్యోగులపై ఇచ్చే ఫిర్యాదులను విచారించే పరిధి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) చట్టం ప్రకారం కమిషన్ పరిధి కేవలం ప్రభుత్వ ఉద్యోగులు వారి నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలకే పరిమితమని స్పష్టతనిచ్చింది.
2
- హైదరాబాద్, జులై 26 (సింగిడి)

ప్రభాతవన సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
27 జులై 2026

## యువ శక్తి ముందు కేంద్ర ప్రభుత్వం
# ఓడిపోయింది

21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ ఛైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్-జీ' తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వయోపరిమితి తగ్గింపు కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిస్తామని సీఎం ప్రకటించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గుర్తుచేశారు. ఇదే సందర్భంగా తెలంగాణ అభివృద్ధిపైనా రేవంత్ మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై తుది నిర్ణయాలు రావాల్సి ఉందని తెలిపారు. "ప్రధాని మోదీ ఈ దేశానికి ప్రధాని. ఆయన గుజరాత్‌ను, తెలంగాణను వేర్వేరుగా చూడకూడదు. గుజరాత్ తరహాలోనే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. వికసిత భారత్ లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.



## మాజీ మంత్రి రోజాకు నోటీసులు


మహిళలపై అవాస్తవ కథనాలు రాసిన పత్రిక ప్రతులను దహనం చేస్తూ నిరసన తెలిపినందుకు తనపై కేసు నమోదు చేశారని రోజా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ అక్రమ కేసు బనాయించిందని ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకే ప్రభుత్వం ఇలాంటి వేధింపులకు పాల్పడుతోందని రోజా మండిపడ్డారు. బెదిరింపులకు, అక్రమ కేసులకు తాను భయపడేది లేదని.. ప్రజల పక్షాన తన పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు, వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోందని ఆ పార్టీ వర్గాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి.

### ప్రైవేటు కంపెనీలను విచారించే పరిధి
## హెచ్ఆర్సీకి లేదు

ప్రైవేటు కంపెనీలు, వాటి ఉద్యోగులపై ఇచ్చే ఫిర్యాదులను విచారించే పరిధి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. మానవ హక్కుల కమిషన్(హెచ్ఆర్సీ) చట్టం ప్రకారం కమిషన్ పరిధి కేవలం ప్రభుత్వ ఉద్యోగులు వారి నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలకే పరిమితమని స్పష్టతనిచ్చింది. కంపెనీలో వేధింపులకు సంబంధించి ఇద్దరు మహిళా ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదులపై హెచ్ఆర్సీ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వెల్స్ ఫర్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులపై కంపెనీ స్పందించలేదని ఇద్దరు మహిళా ఉద్యోగులు హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారని, ఇది కంపెనీ అంతర్గత విషయమని తెలిపింది. ఉద్యోగానికి సంబంధించిన వివాదాలు, కార్యాలయంలో వేధింపులు, పనితీరు అంచనా తదితరాలన్నీ యజమాని, ఉద్యోగికి మధ్య సంబంధాలేనని, వీటిపై విచారించడానికి సమర్థ వేదికలున్నాయని తెలిపింది. ఆరోపణలు తీవ్రమైనవన్న కారణంగా పరిధి లేకుండా ఫిర్యాదులను స్వీకరించరాదంది. కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు తీవ్రమైన అంశమేనని, అయితే వీటి కోసం పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఉందని, వాటి ప్రకారం చర్యలకు సంబంధిత సంస్థలను ఆశ్రయించవచ్చంది. కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతిస్తూ దానిపై హక్కుల కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కొట్టివేసింది. ప్రతివాదులైన బాధిత మహిళలు చట్టప్రకారం సంబంధిత సంస్థలను ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది.

## నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం

**మొదటి పేజీ తరువాయి**



151 సీట్ల పార్టీ 11 సీట్లకు పడిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి పార్టీల పోరాటాలు, ఎన్నికల వ్యూహాల వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎలాగైతే ప్రతి ఇంటికీ వెళ్లారో, ఇప్పుడు కూడా అదే విధంగా వెళ్లి మనం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి" అని సూచించారు.

**నాకు కావాల్సింది అనుచరులు కాదు!**

పార్టీలో నాయకత్వ పటిమను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "నాకు కావాల్సింది అనుచరులు కాదు, పార్టీకి నాయకులు కావాలి. సమస్యలకు పరిష్కారం చూపే నైపుణ్యాలను అలవర్చుకోవాలి. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేస్తూ ప్రజలు, కార్యకర్తలతో సన్నిహితంగా మెలగాలి" అని ఆయన హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు.
గొడ్డలి పార్టీవిధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చంద్రబాబు కోరారు. "ఘోర ఓటమి చవిచూసినా ఆ పార్టీ ఇప్పటికీ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. వారి విధ్వంసకర విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. యువతను వారు ఏ విధంగా నిర్వీర్యం చేశారో, యువత భవిత కోసం కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని ఆయన అన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమైతేనే ప్రతిపక్ష కుట్రలను ఎండగట్టగలమని స్పష్టం చేశారు. "మళ్లీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం, కానీ ఏమరుపాటు వద్దు. రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం కొనసాగాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించాలి" అని ఉద్ఘాటించారు. ప్రజల్లో ఉండటాన్ని ప్రతి నాయకుడు బాధ్యతగా స్వీకరించాలని కర్తవ్య బోధ చేశారు.

**గొడ్డలి పార్టీ నేతలతో వేదికలు పంచుకోవద్దు: సీఎం చంద్రబాబు**

గొడ్డలి పార్టీ నేతలతో ఎట్టి పరిస్థితుల్లోనూ వేదికలు పంచుకోవద్దని సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు ఆదేశించారు. తెదేపా ముఖ్యనేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ విషవృక్షమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నిత్యం కులాలు, మతాలను అడ్డం పెట్టుకుని విద్వేషాలు రగిలించడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పార్టీ ట్రాప్‌లో పడొద్దని నేతలకు చంద్రబాబు హితవు పలికారు.

# నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

ఈ టాస్క్‌ఫోర్స్ ఇచ్చే నివేదిక ఆధారంగా, భవిష్యత్తులో జరిగే పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం భారత ప్రభుత్వం నిరంతరం అనేక చర్యలు తీసుకుంటోంది. వారి భవిష్యత్తుతో చెలగాటమాడిన వారు ఇప్పటికే జైళ్లలో మగ్గుతున్నారు. ఫాస్ట్-ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటు చేశాం. కఠినమైన చట్టపరమైన నిబంధనలతో కొత్త చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావడానికి కూడా సిద్ధమవుతున్నాం. అయితే, మనం భవిష్యత్తును కూడా చూడాలి. మన పరీక్షా వ్యవస్థ విశ్వసనీయంగా, పారదర్శకంగా ఉండాలి. సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించుకోవాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ నిపుణుడు నందన్ నీలేకని నాయకత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం" అని వివరించారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్, ఐబీ మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ చెన్నై డైరెక్టర్ వి. కామకోటి, మాజీ విద్యాశాఖ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్ లాల్ మీనా వంటి ప్రముఖులు సభ్యులుగా



ఉంటారని అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కమిటీ పరీక్షల సంస్కరణలపై దృష్టి సారించి, వీలైనంత త్వరగా నివేదిక సమర్పిస్తుందని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, పేపర్లు లీక్ అయ్యాయని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో, ప్రస్తుతం కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. వినయంతో, పూర్తి బాధ్యతాయుతంగా ఈ విధులను నిర్వర్తిస్తానని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. తీవ్రమైన ఆరోపణలు, విద్యార్థుల ఆందోళనలతో విద్యాశాఖ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ప్రహ్లాద్ జోషి నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.


# కోచింగ్ సంస్థల్లో... కలల ఖరీదు

**మొదటి పేజీ తరువాయి**

అంచనా. మరోవైపు... రూ.58 వేల కోట్ల టర్నోవర్‌లో 20 నుంచి 25 శాతం నికర లాభం ఉంటుందని మార్కెట్ అంచనాలు చెబుతున్నాయి. అంటే రూ.11,500 కోట్ల నుంచి రూ.14,500 కోట్ల వరకు కోచింగ్ సంస్థల యాజమాన్యాలకు నికర లాభం మిగిలే అవకాశం ఉంది. లక్షలాది మంది విద్యార్థులు... రూ.58 వేల కోట్ల వ్యాపారం... కానీ టాప్ కాలేజీల్లో సీట్లు సాధించేది కేవలం ఒకటి నుంచి రెండు శాతం మంది మాత్రమే. ఒకవైపు కుటుంబాల ఆశలు... మరోవైపు కార్పొరేట్ లాభాలు... ఇంకోవైపు అధికారిక గణాంకాలు. ఈ మూడు లెక్కలు కలిపి చూస్తే... కోచింగ్ వ్యవస్థలో ప్రచారాల కంటే గణాంకాలే అసలు నిజాన్ని చెబుతున్నాయి.

**పరిష్కార మార్గం... వ్యవస్థలో మార్పు**

కోచింగ్ వ్యవస్థపై విద్యార్థులు ఆధారపడే పరిస్థితిని తగ్గించే విధానాలే దీర్ఘకాలిక పరిష్కారం. పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల్లోనే పోటీ పరీక్షలకు అవసరమైన నాణ్యమైన బోధన, కాన్సెప్ట్ ఆధారిత విద్య, కెరీర్ గైడెన్స్‌ను బలోపేతం చేయాలి. అదే సమయంలో ప్రవేశ పరీక్షల్లో సీట్ల సంఖ్యను దశలవారీగా పెంచడం, కొత్త ప్రభుత్వ మెడికల్, ఇంజినీరింగ్, ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం అవసరం. కోచింగ్ సంస్థలు తమ ప్రకటనల్లో మొత్తం విద్యార్థుల సంఖ్య, ఎంపికైన వారి శాతం వంటి సమాచారాన్ని పారదర్శకంగా వెల్లడించే విధానాన్ని తీసుకురావాలి. తల్లిదండ్రులు కూడా ప్రకటనల ప్రభావానికి లోనుకాకుండా, అధికారిక గణాంకాలు, విజయశాతం, విద్యార్థి ఆసక్తి, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలి. విద్య వ్యాపారంగా కాకుండా అవకాశాల వేదికగా మారినప్పుడే... పోటీ పరీక్షల ఒత్తిడి తగ్గి, ప్రతిభకు సమాన అవకాశాలు లభించే విద్యా వ్యవస్థ ఏర్పడుతుంది.



## కరిగిపోతున్న ఎయిర్ డిఫెన్స్
# క్షిపణుల నిల్వలు

**వాషింగ్టన్ (సింగిడి)**

ఇరాన్‌పై దాడుల విషయంలో అమెరికా కొంచెం వెనక్కితగ్గింది. తమ వద్దనున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో క్షిపణుల నిల్వలు తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలోనే ఇరాన్‌పై సైనిక చర్యలు తీవ్రం చేసే ప్రణాళికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. సీనియర్ సలహాదారులతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా దళాలు, స్థావరాల రక్షణ కోసం పోరాడితే నిల్వలు వేగంగా కరిగిపోవచ్చని సైనికాధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

## సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై
# హూతీల దాడి

ఇరాన్ మద్దతు గల హూతీ తిరుగుబాటుదారులు ఎర్రసముద్రంలో దిగ్బంధనాన్ని ప్రకటించారు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీని కూడా లక్ష్యం చేసుకున్నట్లు హూతీలు వెల్లడించారు. యెమెన్‌పై సౌదీ జరిపిన వైమానిక దాడులకు వ్యతిరేకంగా ప్రతిదాడులు చేసినట్లు వెల్లడించారు. యెమెన్‌పై దిగ్బంధనం ఎత్తివేసే వరకు ఎర్ర సముద్రంలో నౌకలను అడ్డుకుంటామన్నారు. దాడి కారణంగా చమురు శుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఘటన నేపథ్యంలో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు.



## ఇక సులభంగా.. మల్లన్న దర్శనం

ప్రస్తుతం బస్సులు, ఇతర వాహనాల్లో వస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. బస్సుల్లో వచ్చే భక్తులు రాజీవ్ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న కొమురవెల్లికి చేరుకోవడానికి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు ప్రధాన రహదారిపై గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేది. రోడ్డు ప్రయాణం ద్వారా హైదరాబాద్ నుంచి సుమారు 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 90 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ రెండు మూడు వాహనాలు మారాల్సి వస్తోంది. చేర్యాల, మద్దూరు, ధూల్మిట్ట మండలాల ప్రజలకు సైతం రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది. చదువుల కోసం వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు నిత్యం సుమారు 100 నుంచి 200 మంది వెళ్తుంటారు. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారికి ఒక్కొక్కరికి సుమారు రూ.100 నుంచి రూ.200, కరీంనగర్ నుంచైతే రూ.100- 150 ఖర్చు తప్పదు. రైలు ప్రయాణమైతే సగం ఖర్చు భారం తగ్గుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నిలుపుదల చేసే రైళ్ల వివరాలు..**

సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వరకు నడుస్తున్న 4 డెమూ రైళ్లకు ప్రతి రోజూ ఈ స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించారు.
సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వచ్చే 77654 డెమూ రైలు బుధవారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 2:38 గంటలకు.. 77656 డెమూ రైలు గురువారం మినహా ప్రతి రోజూ ఉదయం 6:45 గంటలకు కొమురవెల్లికి చేరుకుంటుంది.
సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్లే 77653 డెమూ రైలు బుధవారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12:44 గంటలకు, 77655 డెమూ రైలు ప్రతిరోజూ రాత్రి 8:04 గంటలకు కొమురవెల్లికి చేరుకుంటుంది




## శ్రీరాంసాగర్ లో విషాదం

**ఐదుగురిలో ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరిక**

**స్థానికులు మృతదేహాలను వెలికితీశారు**

**ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టిన పోలీసులు**

**బాల్కొండ జులై 26 (సింగిడి)**

నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్ పీ) బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లిన నలుగురు యువకులు నీట మునిగి మృతి చెందారు. వీరితో పాటు వెళ్లిన మరో యువకుడు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది వివరాల్లోకి వెళితే, ముప్కాల్ సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వెనుక జలాల్లోకి ఐదుగురు యువకులు ఆదివారం సాయంత్రం ఈతకు వెళ్లారు. నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడి ఒడ్డుకు చేరుకున్నారు. అతని సమాచారంతో స్థానికులు వెంటనే స్పందించి గాలింపు చేపట్టారు. కొద్దిసేపటికే నలుగురి మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతుల్లో ముగ్గురు నిజామాబాద్ పట్టణానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రక్షణ ఎగుమతుల్లో
# కొత్త శిఖరాలకు భారత్



ఈ నెల (జులై)లో డీఆర్‌డీఓ పినాకా దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్‌ను విజయవంతంగా పరీక్షించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఈ విజయం వెనుక భారత శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల సమష్టి కృషి ఉందని అభిప్రాయపడ్డారు. కేవలం రెండు- మూడు రోజుల క్రితమే డీఆర్‌డీఓ కుశ క్షిపణిని కూడా సక్సెస్‌ఫుల్‌గా పరీక్షించిందని తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఐఎన్ఎస్ మహేంద్రగిరిని భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆధునిక యుద్ధనౌకను దేశంలోనే రూపకల్పన చేసి నిర్మించారని పేర్కొన్నారు. ఈ యుద్ధనౌక తయారీలో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను ఉపయోగించారని, ఇది పెరుగుతున్న 'ఆత్మనిర్భర్ భారత్' బలానికి ప్రతీక అని అభివర్ణించారు.

**'యువ ఆవిష్కర్తలు దూసుకెళ్తున్నారు'**

"జులై 18న దేశ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1'ను శ్రీహరికోటలో విజయవంతంగా ప్రయోగించడంతో భారత్‌లోని ప్రతి పౌరుడు గర్వంతో ఉప్పొంగిపోయాడు. దేశ అంతరిక్ష రంగంలోని ఈ చరిత్రాత్మక ఘట్టానికి ప్రతి ఒక్కరూ సాక్షులుగా నిలిచారు. ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన భారతదేశపు మొట్టమొదటి రాకెట్ ఇది. ఒకప్పుడు ఊహకు కూడా అందని దానిని మన యువ ఆవిష్కర్తలు నిజం చేసి చూపించారు. యువ ఆవిష్కర్తలు అద్భుతమైన నైపుణ్యం, ఫ్యాషన్‌ను కనబర్చారు" అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

**కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్లు పతకాలు సాధించాలి : మోదీ**

ఈ ఏడాది జులై 4న ప్రారంభించిన దేశవ్యాప్త 'క్యాచ్ ది రెయిన్' ప్రచారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం, సంప్రదాయ జలాశయాల పునరుద్ధరణ, పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అలాగే గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్స్ అద్భుతమైన ప్రదర్శన చేసి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు పతకాలు గెలిచి దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరారు.

**'పీవీ సింధు, టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టుకు అభినందనలు'**

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలిగా నిలిచిన పీవీ సింధును మోదీ అభినందించారు. లండన్‌లోని లార్డ్స్‌లో చారిత్రక తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేసిన టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టునూ ప్రశంసించారు. స్థానికంగా లభించే సహజ మట్టితో చేసిన విగ్రహాలను పూజించి గణేశ్ చతుర్థిని ఆనందంగా జరుపుకోవాలని దేశ పౌరులకు మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవమని, ఈ సందర్భంగా నేత కార్మికులకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 15న ప్రతి ఇంటిలో జాతీయ జెండాను సగర్వంగా ఎగరవేయడం ద్వారా 'హర్ ఘర్' ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

# ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను
## రాజకీయాలు అవినీతిమయం: సిద్ధరామయ్య

**బెంగళూరు (సింగిడి)**

ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి తనకు 82 ఏళ్లు వస్తాయని సిద్ధరామయ్య తెలిపారు. గతంలో లాగా ఉత్సాహంతో పని చేయడం తనకు ఇక సాధ్యం కాదని రాసుకొచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ప్రజా జీవితంలో చురుగ్గా ఉంటానని అన్నారు. ప్రజల తరఫున గళం వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. అయితే, వరుణ నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేయాలని ప్రజలు కోరినప్పటికీ వాటిని తిరస్కరించినట్లు సిద్దరామయ్య వెల్లడించారు. గతంలో తాను పోటీ చేసినప్పుడు ప్రజలే విరాళాలు సేకరించి తనను గెలిపించారని అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజలకే డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. నేటి రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, నిజాయతీకి చోటు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య వివరించారు. మాండ్య జిల్లా కేఆర్ పేటలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేయగా, ఆ తర్వాత తన నిర్ణయాన్ని వివరిస్తూ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

**'ఆ సంతృప్తి నాకు ఉంది'**

కాగా, కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం డీ.కే. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, రాజీనామా అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం ఆఫర్ చేసిన రాజ్యసభ సీటును తాను సున్నితంగా తిరస్కరించానని సిద్ధరామయ్య చెప్పారు. తాను 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని, విజయాలు, ఓటములు రెండింటినీ చూశానని పేర్కొన్నారు. కానీ, తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించకపోవడం, అంతరాత్మకు ద్రోహం చేయకపోవడం అనే సంతృప్తి ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, కొన్ని నెలల క్రితం సిద్ధరామయ్య స్వచ్ఛందంగా కర్ణాటక సీఎం పదవి నుంచి వైదొలిగారు. అనంతరం ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



**మంత్రివర్గ విస్తరణ- ఢిల్లీకి సీఎం**

ఇదిలా ఉండగా, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సమయం ఆసన్నమవుతున్న వేళ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోమవారం ఢిల్లీకి బయలుదేరనున్నారు. అక్కడ పార్టీ పెద్దలతో సమావేశమై మంత్రివర్గ విస్తరణకు పచ్చజెండా ఊపే అవకాశం ఉంది. కర్ణాటక భవన్‌లో కేంద్ర మంత్రులు, కర్ణాటకకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలతో సమావేశం కానున్నారు. అనంతరం, పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణకు అనుమతి కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై రాహుల్ గాంధీతో చర్చించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.
అయితే, మంత్రి పదవి కోసం కొంతమంది ఎమ్మెల్యేలు చివరి నిమిషంలో లాబీయింగ్ చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారని సమాచారం. ఇందుకోసం ఢిల్లీకి పయనమయినట్లు సమాచారం. కాగా, గత వారం, నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఆందోళన కారణంగా, ముఖ్యమంత్రి డీకే, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ మంత్రివర్గ విస్తరణపై చర్చించలేకపోయారు. ఇప్పుడు నీట్ పోరాటం ముగిసింది కాబట్టి, రాహుల్ గాంధీతో కలిసి మంత్రివర్గ విస్తరణకు అనుమతి పొంది, మంత్రుల జాబితాను ఖరారు చేసే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ ఏ క్షణంలోనైనా జరగవచ్చని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టం చేశారు.

ప్రభాతవార్త సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
27-7-2026



# ఎస్ఐఆర్‌లో పాల్గొనడం..
# ప్రతిఒక్కరి బాధ్యత

- స్థానికంగా నివాసముంటున్న ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌లో వివరాలను నమోదు చేయించండి
- ప్రతి ఓటు పటాన్చెరు అభివృద్ధికి పునాది
- పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, జూలై 26(సింగిడి):** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేయించుకుని.. పటాన్చెరును రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడంలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు, కార్మికులకు ఎస్ ఐ ఆర్ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు ఉండడం అత్యంత అవసరమని అన్నారు. ఓటు ఉన్నప్పుడే ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పాటు.. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. పటాన్చెరు భవిష్యత్తుకు ప్రతి ఓటు అత్యంత కీలకమని అన్నారు. మినీ ఇండియాగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాల ప్రజలు జీవనోపాధి నిమిత్తం స్థానికంగా నివసిస్తూ.. ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. వారందరూ విధిగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పాల్గొనాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కులం, మతం, ప్రాంతం విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. అన్ని రాష్ట్రాల ప్రజల పండుగలను, పర్వది నాలను కలిసిమెలిసి నిర్వహిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుపుతున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఎస్ఐఆర్ అంశంపై అవగాహన కల్పించారు. ఇటీవల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాయికోటి రాజును ఎమ్మెల్యే జిఎంఆర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, బాల్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, రామచంద్ర రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

## కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు ఎమ్మెల్యే నివాళి

- రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలకు ప్రశంసాపత్రాల ప్రదానం
- వీరజవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**అల్వాల్, జూలై 26 (సింగిడి):** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఈరోజు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి బొల్లారం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు లాన్స్ నాయక్ ఎం. వై. రామచందర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గారు స్వచ్ఛం దంగా రక్తదానం చేసిన దాతలను అభినం దించి, వారికి ప్రశంసాపత్రాలను అందజేశా రు. సమాజ సేవలో రక్తదానం అత్యున్నతమైన మానవతా సేవ అని, యువత ఎక్కువ సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరవీరు డు లాన్స్ నాయక్ ఎం. వై. రామచందర్ సతీమణి శ్రీమతి దివ్యను, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గారు పరామర్శించి, వారి త్యాగస్ఫూర్తికి వందనం తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల సేవలను దేశం ఎన్నటికీ మరువదని, వారి కుటుం బాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో అమరవీరుడు లాన్స్ నాయక్ ఎం. వై. రామచందర్ సతీమణి శ్రీమతి దివ్య, కుటుంబ సభ్యులు మహేష్, రవికిరణ్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్, అరుణ్ రావు, భాస్కర్ రెడ్డి, పవన్, రేవంత్, మహేష్, రెహ్మత్ ఖాన్, నార్ల సురేష్, నర్సింగ్ రావు, గణేష్, దేవేందర్, ఫెరోజ్, అతిక్ పాషా, బంటి, వర్మా తదితరులు పాల్గొన్నారు.

## సంకల్పపార్కు అభివృద్ధికి సంపూర్ణ సహకారం..

- పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, జూలై 26 (సింగిడి):** భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజిలో గల సంకల్ప్ పార్కు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పార్కులో వాకింగ్ ట్రాక్, లైట్స్, క్రీడా సామాగ్రి, బాల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం ఎల్ఐజి సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీహెచ్ఈఎల్ ఎల్ఐజి హౌజ్ బిల్డింగ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్ రెడ్డి, ఐలేష్, రమణ, వెంకట్ రెడ్డి, యాదగిరి రెడ్డి పాల్గొన్నారు.



## నేటినుండి విత్తన మేళా


- జిల్లా వ్యవసాయాధికారి కవిత

**వికారాబాద్, జూలై 27(సింగిడి):** జిల్లాలోని అన్ని మండల కేంద్రాల రైతు వేదికలలో జూలై 27 నుండి 29 వరకు విత్తన మేళ నిర్వహించబడుతోందని జిల్లా వ్యవసాయ అధికారి బి. కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్-నినో పరిస్థితుల దృష్ట్యా విత్తన మేళా సందర్భంగా ప్రత్యామ్నాయ పంటల సాగు, అత్యవసర ప్రణాళిక పై రైతులకు అవగాహన కల్పించే సమావేశాలను ఏఈఓలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. అంతేకాకుండా మేళా సమయంలో విత్తన వ్యాపారులు రైతు వేదికలలో కౌంటర్లను ఏర్పాటు చేసి అత్యవసర ప్రణాళికలో భాగంగా ప్రోత్సహిస్తున్న పంటల విత్తనాలన్నింటిని అందుబాటులో ఉంచాలని ఆమె ఆదేశించారు. రైతుల సౌలభ్యం కోసం అన్ని కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాలు ఒకే చోట లభించే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవచ్చునని ఆమె సూచించారు. విత్తన మేళా గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, గరిష్ట సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందేలా చూడాలని ఎంఏఓ, ఏఈఓ లను జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు.



## యువకులు స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకొని సమాజానికి ఒక ఆదర్శం

బీఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద





**కుత్బుల్లాపూర్, జూలై 26 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ వార్డు నెం.281, సంజయ్ గాంధీ నగర్ గుబురుగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంవైటీఐఎన్ ఎడిటింగ్ అండ్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్‌ను బీఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాప్ యజమానులను అభినందిస్తూ, వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెంది విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. యువ పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకొని కొత్త వ్యాపారాలను ప్రారంభించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, చింతల్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీక్, 129 డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు జైహింద్, కార్తీక్ గౌడ్, బీఆర్ఎస్ నాని, లక్ష్మణ్ గౌడ్, అల్లావుద్దీన్, షకీల్, ఉదయ్, సురేష్, టింకు, షాప్ యజమానులు పాల్గొన్నారు.

## స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం

అకాల మరణంతో దుఃఖంలో ఉన్న స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలిచిన 2002-03 బ్యాచ్ మిత్రులు



**ఆమనగల్లు, జూలై 26(సింగిడి):** కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002--2003 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ స్నేహబంధాన్ని మరోసారి చాటుకున్నారు. తమ సహ విద్యార్థిని రాధిక భర్త ఇటీవల అకాల మరణం చెందడంతో ఆమెను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మిత్రులు తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండటమే నిజమైన స్నేహానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైనప్పుడు సహచరులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ, గోవర్ధన్, మల్లేష్, సదానందం, మహేష్, జంగయ్య, బిక్షపతి, కేశవులు, వెంకటేష్, చంద్రకాంత్, సురేష్, విమలమ్మ, నిట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు మిత్రుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జ్ఞానం దిశను చూపిస్తే... అనుభవమే నిజమైన అభ్యసనాన్ని తీర్చిదిద్దుతుంది

- ఘనంగా బిట్స్ పిలాని(2026) స్నాతకోత్సవ వేడుకలు
- బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు శ్రీహరి మీనన్





**జవహర్ నగర్, జూలై 26 (సింగిడి):** జ్ఞానం దిశను చూపిస్తే అనుభవమే నిజమైన అభ్యసనాన్ని తీర్చిదిద్దుతుందని బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు శ్రీహరి మీనన్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ బిట్స్ హైదరాబాద్ క్యాంపస్ లో ఆదివారం 2026 వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు శ్రీహరి మీనన్ హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు సవాళ్లను ధైర్యంగా స్వీకరించాలని అర్థవంతమైన సంబంధాలను విలువైనవిగా భావించాలని అలాగే చిరస్థాయి విజయం మంచి వ్యక్తిత్వం నిరంతర అభ్యాసనం తప్పుల నుండి నేర్చుకొని ఎదగాలని ఇవన్నీ ధైర్యం మీదే ఆధారపడి ఉంటుందని విద్యార్థులకు తెలిపారు. అనంతరం పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రొఫెసర్ ధర్మరాజన్ శ్రీరామ్ విద్యార్థుల సాధించిన విజయాలకు అభినందనలు తెలియజేస్తూ వారి తల్లిదండ్రులు ఆధ్యాపకులు మార్గదర్శకులు అందించిన అచంచలమైన సహకారాన్ని ప్రసవించారు. బిట్స్ పిలానీలో విద్య కేవలం విద్య ప్రావీణ్యత కే పరిమితం కాదని నిజాయితీ ఆవిష్కరణత్మక ఆలోచన సంకల్పబలం సమాజంలో సార్థకమైన మార్పు తీసుకురావాలని భద్రత కలిగిన వ్యక్తులను తీర్చి దిద్దుతుందని పేర్కొన్నారు. జీవితాంతం నేర్చుకుంటూ ఉండాలని సవాళ్లను ఆత్మవిశ్వాసంతో స్వీకరించాలని వినయంతో అత్యుత్తమ భవిష్యత్తును సాధించాలని మరింత సమానత్వం స్థిరత్వం సాంకేతిక పురోగతి కలిగిన భవిష్యత్తు నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని పట్టభద్రులకు సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 1500 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 1200 మంది కి పైగా ఫస్ట్ డిగ్రీలు, సుమారు 200 మందికి హయ్యర్ డిగ్రీలు, అలాగే 100 మందికి పీహెచ్డీ పట్టాలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలాని 2026 బ్యాచ్ పట్టభద్రులకు అభినందనలు తెలియజేస్తూ బిట్స్ పిలాని సంస్థ వారు పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ విద్యార్థులు బిట్స్ పిలాని యొక్క గొప్ప వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రపంచవ్యాప్తంగా విద్యారంగం పరిశ్రమలు వ్యవస్థాపక ప్రజాసేవ పరిశోధన రంగాల్లో విశిష్టమైన సేవలు అందించాలని ఈ సందర్భంగా బిట్స్ పిలాని ఇన్స్టిట్యూషన్ పునరుద్ఘా టించింది. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలాని వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వి. రామ్ గోపాల్ రావు, బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ఇన్చార్జ్ ప్రొఫెసర్ ధర్మరాజన్ శ్రీరామ్, గవర్నర్ల మండలి సభ్యులు, సెనేట్ సభ్యులు, ఆధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడుగుంతలు తవ్వితేనే ఇంటికి నిర్మాణ అనుమతులు ఇవ్వాలి

- సామాజిక సేవా కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్

**కుత్బుల్లాపూర్, జూలై 26 (సింగిడి):** అబ్దుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్లోని కోల రవీందర్ ముదిరాజ్ ఇంట్లో 25 సంవత్సరాల క్రితం 14 అడుగుల లోతుతో ఇంకుడు గుంత తీసి వర్షపు నీటి నిలువలను కాపాడుకుంటున్నట్లు కోల రవీందర్ ముదిరాజ్ తెలిపారు. ప్రతి సంవత్సరం మేడపై నుంచి వచ్చిన నీటిని ఇంకుడు గుంతలలో చేరేలా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇంకుడు గుంతలలో పేరుకుపోయిన చెత్తాచెదారం ఆదివారం తొలగించి మళ్లీ ఇసుకతో నింపామన్నారు. నీటి నిల్వలు రోజురోజుకు అడుగంటి పోతున్న దృష్ట్యా ప్రతి ఇంటి నిర్మాణానికి విధిగా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని ఇంకుడు గుంతలు లేని




ఇంటి వద్ద బోర్ వేస్తే లక్ష రూపాయల జరిమానా విధించాలని ప్రభుత్వాన్ని అధికారులను కోలా రవీందర్ ముదిరాజ్ కోరారు. భవిష్యత్తు తరాల అవసరాల దృష్ట్యా నీటిని నిలువలను కాపాడుకోవాలంటే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత విధిగా నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తన ఇంట్లో 300 అడుగులకే 15 ఏళ్ల క్రితం వేసిన బోరు ఇప్పటికీ నీరు పోస్తుందని ఎందుకు ఇంకుడు గుంతలో నిల్వ ఉన్న వర్షపు నీరే కారణమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వర్షపు నీటిని కాపాడుకోకపోతే భవిష్యత్తులో 3000 వెల,అడుగుల బోరువేసిన మూడు చుక్కల నీరు రాదే రాదేమోనని భయమేస్తుందన్నారు. కుడు గుంతలను పునరుద్ధరించాలి, కొత్బుల్లాపూర్, గాజులరామారం ,పాత సర్కిల్లో వందలాది ఇంకుడు గుంతలు గతంలో తీశారని అవి చెత్తాచెదారంతో మూసుకుపోయాయి. కొంపల్లి సర్కిల్ సూరారం కాలనీ రామ్ లీలా మైదాన్ లో కనబడుతుంది, ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు, ఆకాశానంటే అపార్ట్మెంట్లు, భూమిలోకి నీరు పోయే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉంటేనే రిజిస్ట్రేషన్,చేసే విధంగా, హెచ్ ఎం డి ఏ, వారు ఇంకుడు గుంత ఇంజక్షన్ బోర్ ఉంటేనే ఆ లే అవుట్ కు(ప్లాన్) అనుమతి ఇవ్వాలి,రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఇంకుడు గుంతలేని వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ, రైతుబంధు ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన ఇంట్లో ఇంకుడు గుంత ఉంటేనే ప్రమోషన్ బెనిఫిట్స్ ఇవ్వాలి,ప్రతి అపార్ట్మెంట్లో వర్షం పడ్డప్పుడు నీరు బయట వస్తే జరిమానా విధించాలి. గ్రేటర్ కమ్యూనిటీలో కూడా తప్పనిసరి ఇంకుడు గుంత ఉండాలి నీరు బయట రాకూడదని కఠినమైన నిబంధనలు విధించాలని సూచించారు. పరిశ్రమల్లో తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ( ఐలా),కూడా ప్రతి పరిశ్రమకు నోటీసు ఇవ్వాలి, ఇంకుడు గుంత తప్పనిసరి అని తెలియజేయాల్సిన బాధ్యత ఐలా కమిషన్ తీసుకోవాలన్నారు.

## రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

**సిద్ధిపేట బ్యూరో, జూలై 26 (సింగిడి):** ఈ నెల 27, 28,29 మూడు రోజులు రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలలో రైతులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి శనివారం రోజున పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 26 మండలాల్లో, ప్రతి మండలంలోని ఒక రైతు వేదికలో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. ఈ విత్తన మేళాలో రైతులకు అవసరమైన నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు ముఖ్యంగా చిరుధాన్యాల (మిల్లెట్స్) విత్తనాలు జొన్నలు,సజ్జలు, రాగులు, కొర్రలు, పప్పుధాన్యాల విత్తనాలు కందులు, మినుములు, పెసర, బొబ్బర్లు, నూనెగింజల పంటల విత్తనాలు ప్రొద్దు తిరుగుడు, నువ్వులు, ఆముదం మొదలగునవి అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుతం నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని, తక్కువ నీటితో అధిక దిగుబడిని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ఈ విత్తన మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

## 'నారాయణ'లో పేరెంట్స్ డే వేడుకలు



**అల్వాల్, జులై 26 (సింగిడి):** మచ్చ బొల్లారం డివిజన్ బొల్లారం బ్రాంచ్ నారాయణ పాఠశాలలో ఉపాధ్యాయుల తల్లితండ్రుల సమావేశం జరిగింది, 1 వ తరగతి నుండి 5వ తరగతి వరకు జరిగిన సమావేశంలో సుమారుగా 100 మంది పైగా విద్యార్థు లు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు, మీ వర్క్ తో పాటు పిల్లల చదువు కొరకు కూడా కొద్దిగా సమయం కేటాయించాలని ఉపాధ్యాయులు తల్లితండ్రులకు సూచించారు, ఈ కార్యక్రమంలో ఏ.జి.ఎం పురుషోత్తం రెడ్డి, ప్రిన్సిపాల్ డా, జాస్మిన్ మాథ్యూస్, కో ఆర్డినేటర్ దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణి,పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములుకు ఘన సత్కారం

**రాజేంద్రనగర్,జులై 26(సింగిడి):** మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన శ్రీరాములును నెమలిగర్ కాలనీ వాసులు, ఆదివారం ఘనంగా సత్కరించారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెమలిగర్ కాలనీ వాసులు శ్రీరాములును శాలువా కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, అలాగే మణికొండ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తారని కాలనీవాసులకు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి, ప్రజలకు అందుబాటులో ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నెమలిగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యంలో బడుగులందరు సుభిక్షం

**వికారాబాద్, జూలై 26(సింగిడి):** ఇందిరమ్మ రాజ్యంలో బడుగు బలహీన వర్గాలందరు సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు కె గంగరాజు ముదిరాజ్ అన్నారు. ఆదివారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్లో బీసీ నాయకులు ఆత్మీయసన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో బీసీలు ఎస్సీ ఎస్టీ మైనారిటీలు అందరూ సంతోషంగా జీవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి యాదవ్, కౌన్సిలర్ మల్లికార్జున్ గౌడ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు రాఘువేందర్, ముదిరాజ్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం సర్పంచులు శ్రీనివాస్ ముదిరాజ్, ఆంజనేయులు, అనిత, ముదిరాజ్ , దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi సోమవారం 27-7-2026

# ఎడిటోరియల్

Editorial

## కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు?

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్నట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఏజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు –నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది. పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజిపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదాని పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

### మూత్రపిండ మార్పిడి వైద్యంలో

# భారత తొలి శస్త్రవైద్యుడు

### డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ జీవన చరిత్ర



భారతదేశ వైద్య రంగ చరిత్రలో అత్యంత గౌరవనీయ స్థానం పొందిన వైద్యులలో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ ముందుంటారు. ఆయనే భారత దేశంలో మొట్టమొదటి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన శస్త్ర వైద్యుడు. ఆయన విజ్ఞాన పూరిత వైద్య నైపుణ్యంతో పాటు దేశ ప్రజల ఆరోగ్య సేవలో చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా పద్మశ్రీ అవార్డు వరించింది. దేశానికి వైద్యపరంగా మార్గ దర్శకుడిగా నిలిచిన ఈ మహోన్నత వ్యక్తిత్వం గల వైద్యుని జీవితాన్ని, సేవలను సవివరంగా విశ్లేషిద్దాం.

డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ 1937 జూలై 27న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లోని బదౌన్ జిల్లాలోని నౌలిహరనాథ్పూర్ గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య తర్వాత లక్నో విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న కింగ్ జార్జ్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్హతలు పొందారు. 1961లో ఎంబీబీఎస్, 1964లో ఎంఎస్ (జనరల్ సర్జరీ) పూర్తి చేశారు. తరువాత 1974లో ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ (ఫీ×జూ), 1977లో అమెరికన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ (ఫీూజూ) సర్టిఫికెట్లను పొందారు. ఈ సాంప్రదాయ, అంతర్జాతీయ ప్రమాణాల నైపుణ్యం ఆయనకు వైద్యరంగంలో విశిష్ట స్థానం కల్పించింది.

1973లో చండీగఢ్‌లోని ప్రఖ్యాత పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (గ్రా+×వీజు=) లో ఆయన నేతృత్వంలో భారతదేశపు మొట్టమొదటి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించ బడింది. ఈ ఆపరేషన్ వైద్య చరిత్రలో ఘనతను సాధించిన మైలురాయిగా నిలిచింది. ఆ కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉండగా, ఓ రోగికి కొత్త జీవితం ప్రసాదించడం అతని వైద్య నైపుణ్యం, ధైర్యానికి అద్భుత ఉదాహరణ. ఇది కేవలం వైద్య విజయం కాదు, దేశ ప్రజారోగ్య చరిత్రలో ఒక గొప్ప ఉపాధి క్షేత్రాన్ని తెరలేపిన సంఘటన.

ఆయన వైద్య సేవలు ఢిల్లీ ప్రభుత్వాసుపత్రులలో, ముఖ్యంగా రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి, గ్రేటర్ కాలకజీ ఆసుపత్రి వంటి ప్రఖ్యాత ఆసుపత్రులలో కొనసాగాయి. ఆయన శస్త్ర వైద్య విభాగానికి నాయకత్వం వహిస్తూ అనేకమంది శిక్షణ పొందిన వైద్యులను ట్రాన్స్ప్లాంటేషన్ స్పెషలిస్టులుగా తీర్చిదిద్దారు. కేవలం రోగుల సేవే కాకుండా, వైద్య విద్యార్థుల విద్యను, పరిశోధనను ప్రోత్సహించారు. ట్రాన్స్ప్లాంటేషన్‌కు సంబంధిత నైతిక, న్యాయపరమైన విధానాల రూపకల్పన లోనూ ఆయన గణనీయమైన పాత్ర పోషించారు.

ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1982లో పద్మశ్రీ అవార్డుతో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్‌ను సత్కరించింది. మూత్రపిండ మార్పిడి శస్త్ర చికిత్సల రంగంలో భారత దేశంలో ఈ అవార్డు అందుకున్న మొట్టమొదటి వైద్యుడు ఆయనే. అంతేకాకుండా, దేశ అధ్యక్షులు నీలం సంజీవ రెడ్డి, జ్ఞానీ జైల్ సింగ్, ఆర్. వెంకటరామన్‌లకు గౌరవ వైద్యుడిగా సేవలందించారు. ఇది ఆయన వైద్య నైపుణ్యానికి, వ్యక్తిత్వ మహిమాన్వితానికి అద్దం పడే ఘనత.

ఆయన సేవా భావాన్ని, దాతృత్వాన్ని మరింత విస్తరించేందుకు "రాజ్ వీర్ సింగ్ యాదవ్ ఫౌండేషన్" స్థాపించ బడింది. ఈ సంస్థ భారతీయ సమాజాల్లో ఆరోగ్య, విద్య, సాధికారత తదితర రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

డాక్టర్ యాదవ్ 2016 ఫిబ్రవరి 4న మరణించారు. ఆయన మరణం దేశ వైద్య సమాజానికి తీరని లోటు. కానీ ఆయన వేసిన పునాదులపై వేలాది మంది వైద్యులు నేడు దేశవ్యాప్తంగా మూత్రపిండ మార్పిడి సేవలందిస్తున్నారు. ఆయన చూపించిన మార్గం, నిబద్ధత, మానవతా విలువలు వైద్యసేవలోనూ, సామాజిక రంగాల్లోనూ చిరస్థాయిగా నిలుస్తాయి.

వైద్య విజ్ఞానానికి, సేవాభావానికి మహోన్నత ప్రతీకగా నిలిచిన డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ గురించి చెప్పినప్పుడు "వైద్యో నారాయణో హరిః" అన్న వాక్యం సహజంగా గుర్తుకు వస్తుంది. ఆయన జీవితానికి, సేవా యాత్రకు అదే యథార్థ కీర్తి.

**రామ కిష్టయ్య సంగనభట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్టు**
**9440595494**

# అనితర సాధ్యాలు... సంగం లక్ష్మీబాయి సేవలు

### నేడు సంగం లక్ష్మీబాయి జయంతి



**తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు స్వాతంత్య్ర సంగ్రామంలో మహిళలను ముందుండి నడిపించిన ధీర వనిత ఆమె. బాలికల, స్త్రీల సంక్షేమం కోసం నిరంతరం తపించి, జీవితాంతం చిత్తశుద్ధితో పాటుపడిన సేవా నిరతికి ప్రతిరూపం ఆమె. స్వాతంత్య్ర సమర యోధురాలుగా తామ్రపత్ర గ్రహీత ఆమె. శాసన సభ్యురాలిగా, విద్యా మంత్రిణిగా, ఆంధ్రప్రదేశ్ సామాజిక, సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిణిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాధ్యు రాలిగా సమర్థ వంతంగా పనిచేసి, ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె. ఆమే ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళగా గుర్తింపు పొందిన సంగం లక్ష్మీబాయి.**

సంగం లక్ష్మీబాయి(జూలై 27, 1911 - జూన్ 3, 1979) 1911, జూలై 27 న ఘటకేసర్ సమీపం లోని ఒక కుగ్రామంలో జన్మించారు. బాల్యం లోనే తల్లిదండ్రులు, చిన్నతనం లోనే వివాహమై భర్త చని పోవడంతో ఆమె అనాథ అయ్యారు. చాలా చురుకైన బాలిక కావడంతో మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం లభ్యమైంది. కార్వే విశ్వ విద్యాలయం, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ ప్రారంభించిన శారదా నికేతన్, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో చదువు కున్నారు. అక్కడ ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నారాయణ గూడలో ఉన్న రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసు కుంటూనే మరోవైపు స్వాతంత్ర్యో ద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు.

ఆమె సాంఘిక సేవలోనే పూర్తి సమయం వెచ్చించి ఆ తర్వాత రాజకీయాలలో చేరారు. ఆమె విద్యార్థిగా ఉన్న రోజులలో సైమన్ కమీషన్ ను వ్యతిరేకించారు. ఉప్పు సత్యాగ్రహం (1930–31) లో క్రియాశీలంగా పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు.

స్వామి రామానందతీర్థ ఆధ్వర్యంలో సాగిన నిజాం వ్యతిరేక ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించారు. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొని అరెస్ట్ అయి రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. ఆమె వినోభా భావే యొక్క తొలి పాద యాత్రకు తెలంగాణలో సారథ్యం వహించారు. 1950లో భూదానో ద్యమ యాత్ర కోసం తెలంగాణకు వచ్చిన ఆచార్య వినోబా బావే ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. ఆయన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు 16 గ్రామాలు తిరిగి 314 ఎకరాల భూమిని సేకరించారు. 1947-48లో తెలంగాణ విమోచనో ద్యమం లోనూ పాల్గొన్నారు. విమోచన అనంతరం సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఆమె 1952 లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావు కేబినెట్‌లో విద్యాశాఖ సహాయ మంత్రిగా 1954 నుంచి 1956 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హయాంలోనే తెలంగాణ జిల్లాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమయ్యాయి. మంత్రిగా సంపాదన మొత్తాన్ని స్త్రీ సేవాసదన్‌కు ఉపయోగించారు. 1955లో దాన్ని తన సహచరులైన కేవీ రంగారెడ్డి, ఎ.శ్యామలాదేవి, పి.లలితాదేవి, పాశం పాపయ్య, ఎం.భోజ్‌రెడ్డితో కలిసి ఇందిరా సేవా సదన్‌గా రిజిస్టర్ చేయించారు. తద్వారా అనాథ మహిళలు, శిశువులకు ఉచిత విద్యనందించారు. సంతోష్ నగర్ చౌరస్తాలో ప్రస్తుతం ఐ.ఎస్.సదన్ గా పిలవబడుతున్న ప్రాంతంలో ఆమెకు రెండెకరాల స్థలంలో ఇల్లుండేది. తమ సొంత ఇంటిలోనే అనాథ శరణాలయాన్ని ప్రారంభించారు. అదే కాకుండా రాధికా మెటర్నిటీ హోమ్, వసు శిశువిహార్, మాశెట్టి హనుమంతు గుప్తా బాలికల ఉన్నత పాఠశాలల యొక్క స్థాపనలో ఆమె పాత్రలు మరిచి పోలేనివి.

లక్ష్మీబాయి సేవల గురించి తెలుసుకున్న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా వచ్చి సాయం చేశారు. నాటి డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డితో పాటు ఇందిరా గాంధీ కూడా సేవా సదనం నిర్వహణకు తోడ్పాటు అందించారు.

1957లో మెదక్ నియోజక వర్గం నుండి 2వ లోకసభకు ఎన్నిక య్యారు. 1962 లో 3వ లోకసభకు ఎన్నికయ్యారు. మూడవ సారి 1967లో 4వ లోకసభకు వరుసగా మెదక్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు.

హైదరాబాదు యాదవ మహాజన సమాజం అధ్యక్షురాలిగా, అఖిల భారత విద్యార్థి సంఘం ఉపాధ్యక్షు రాలిగా, హైదరాబాదు ఫుడ్ కౌన్సిల్, ఆంధ్ర యువతి మండలి అధ్యక్షురాలిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా బోర్డుకు కోశాధికారిణిగా, హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగ కన్వీనరుగా ఉన్నారు. ఆమె పద్దెనిమిదేళ్ల పాటు ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెసు కమిటీ బాధ్యురాలిగా కొన్నాళ్లు పని చేశారు. స్వాతంత్య్ర సమర యోధురాలిగా గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెకు తామ్రపత్రం ఇచ్చి గౌరవించింది. 1979లో మరణించే వరకు లక్ష్మీబాయి స్త్రీలు, బాలికల సంక్షేమం కొరకు నిర్విరామ, అసమాన కృషి చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi సోమవారం 27-7-2026

## వెలమ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్‌కు సన్మానం



- ప్రజాసేవతో పాటు సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని సంఘం ఆకాంక్ష

**కరీంనగర్, జులై26(సింగిడి):** కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన పద్మనాయక వెలమ సంఘం సర్వసభ్య సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావును ఘనంగా సత్కరించారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా సంఘం అధ్యక్షుడు హనుమంతరావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ యాదగిరి సునీల్‌రావు ప్రజాసేవలో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తూనే పద్మనాయక వెలమ సామాజిక వర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, కరీంనగర్ పాల డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, కరీంనగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నమనేని సుధాకర్‌రావు, ఇటీవల ఎన్నికైన వెలమ సంఘానికి చెందిన సర్పంచులు, కార్పొరేటర్లు, జిల్లా పద్మనాయక వెలమ సంఘం సభ్యులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలు, పీఆర్సీ వెంటనే అమలు చేయాలి



- అమల్లో జాప్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని స్పష్టం
- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి

**కరీంనగర్, జులై 26(సింగిడి):** కరీంనగర్‌లో ఆదివారం జరిగిన డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా శాఖ సమావేశంలో పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఆరోగ్య బీమా, విద్యా విధానాలపై పలువురు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి. రాజిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడు సంవత్సరాలుగా పీఆర్సీ అమలు కాకపోవడం, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే అమలు చేసి, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరింత ఆలస్యం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి మాట్లాడుతూ, మే నెల నుంచి ఆరోగ్య బీమా ప్రీమియం మినహాయింపులు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు విధివిధానాలు ప్రకటించలేదని విమర్శించారు. ఉద్యోగులకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందేలా వెంటనే మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్‌మోహన్ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలలను ప్రభావితం చేస్తున్న జీవో నెం. 25ను సవరించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి మాట్లాడుతూ, ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో అన్ని వర్గాలకు ఒకే విధమైన అర్హత మార్కులు నిర్ణయించాలని, అభ్యర్థులు చదివిన సంబంధిత సబ్జెక్టులోనే పరీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు టి. తిరుపతి, ఎ. శ్రీనివాస్, ఆర్. శంకరయ్య, బి. రమేష్, ఎం. సత్యనారాయణ రెడ్డి, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## చాగంటి కోటేశ్వరరావుకు ఎమ్మెల్యే స్వాగతం



- వైశ్య భవన్‌లో ఆధ్యాత్మిక ప్రవచనాలు.. భక్తిశ్రద్ధలతో సత్కారం

**కరీంనగర్, జులై 26(సింగిడి):** జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో శ్రీ వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు ఘన స్వాగతం పలికి, పూలమాలలు, శాలువాతో సత్కరించారు. సనాతన ధర్మం, మానవతా విలువలను తన ప్రవచనాల ద్వారా సమాజానికి చేరవేస్తున్న చాగంటి వారి సేవలు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు, శ్రీ వరసిద్ధి వినాయక సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి స్ఫూర్తితో ప్రజా సేవలో ముందుకు..



**మల్కాజిగిరి, జులై 26 (సింగిడి):** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాల స్ఫూర్తితో ముందుకు పోతూ, ఆపదలో ఉన్న పేదవారికి తనకు తోచిన సహాయంను చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ కపిలేశ్వర్ అన్నారు. మాజీ మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతల కపిలేశ్వర్ సన్ ఫ్లవర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రాము ముదిరాజ్ అనే వ్యక్తికి వైద్యం కోసం 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం ను అందజేశారు. అనంతరం రాము ముదిరాజ్ వైద్య ఖర్చులు రూ. 6 లక్షల వరకు బిల్లు కాగా, స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల కపిలేశ్వర్ సన్ ఫ్లవర్ హాస్పిటల్ కి వెళ్లి హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి రూ. 4 లక్షల 50 వేలను తగ్గించి, రూ. 1లక్ష 50 వేల ను ఫైనల్ అమౌంట్ చేయించారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మాజీ మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ బాబుకి, కపిలేశ్వర్ లకు ఎల్లవేళలా వాజ్పేయి నగర్ వాసులు గా మేము రుణపడి ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు రొట్టెల ధరన్, మనోజ్ చారి, వాజ్పేయి నగర్ యూత్ పప్పు, సాయి, కిట్టు ముదిరాజ్, శ్రీకాంత్, శ్రీనివాస్, జావేద్, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అవోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి
- అవార్డుల ప్రధానోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్
- ప్రతిభ గల విద్యార్థులకు అవార్డులు ప్రదానం



**జమ్మికుంట, జులై 26 (సింగిడి):** ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే వారు అనుకున్న గమ్యానికి చేరుకుంటారని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని స్థానిక వర్తక సంఘ భవనంలో ఆవోప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన రమేష్ అతిథులుగా పాల్గొనగా జమ్మికుంట అధ్యక్షులు ఆకినపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఇతర పోటీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను అవోపా సంఘం గుర్తించి మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో సత్కరించింది. అనంతరం అతిథులు మాట్లాడుతూ, చదువులో ప్రతిభను చాటిన విద్యార్థులను గుర్తించి ఆవోప ఆధ్వర్యంలో వారిని సత్కరించి సన్మానించడం వల్ల వారిలో మరింత పట్టుదల పెరుగుతుందని భవిష్యత్తులో తద్వారా చదువుపై ఆసక్తి పెరిగి ఇలాంటి అవార్డులు తీసుకోవాలని ఆలోచన వారికి వస్తుందని పేర్కొన్నారు. ఆవోప ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ అవార్డులు అందించడం జరుగుతుందని ఇది కేవలం ఆర్యవైశ్య కుల బంధువుల విద్యార్థులను ప్రోత్సహించడానికి ఒక వేదిక అని అన్నారు. సుమారు 80 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించడం అభినందించదగ్గ విషయమని ఇలాంటి కార్యక్రమానికి తమ సహాయ సహకారాలు అందించిన జమ్మికుంట ఆవోప సభ్యుల ను వారు అభినందించారు. అనంతరం జమ్మికుంట ఆవోప అధ్యక్షులు ఆకిన్నపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆవోప అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన రమేష్, సామానారాయణ, పివి రామకృష్ణ, జిల్లా బాధ్యులు ఐత సుధాకర్, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు లెంకల్లపల్లి శరత్ కుమార్ జమ్మికుంట అవోపా అధ్యక్షులు అకినపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నగేష్, మంచాల రాంబాబు, జోన్ ట్రెజరర్ బచ్చు రమేష్, సంఘ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బకాయిల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి, లేదంటే జల భవన్'ముట్టడి

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన

తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి రమణారావు



**కరీంనగర్, జులై26(సింగిడి):** ఉద్యోగ విరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన వేతన సవరణ బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, లేకపోతే ఆగస్టు 4న హైదరాబాద్‌లోని జలభవన్ వద్ద 'ఛలో జల భవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జోన్ (ఉత్తర తెలంగాణ) గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి రమణారావు హెచ్చరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని తారక్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జోనల్ అధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, రాష్ట్ర నాయకులు సుధాకర్, రత్నం, చంద్రయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు దశాబ్దాల పాటు కష్టపడి ప్రజా రవాణా సేవలకు తమ జీవితాన్ని అంకితం చేసినప్పటికీ, వారి పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రమణారావు విమర్శించారు. 2017లో అమలు కావాల్సిన వేతన సవరణను 2024లో, 2021లో జరగాల్సిన మరో వేతన సవరణను 2026లో అమలు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొన్నారని తెలిపారు. గత మూడు నెలలుగా ఆర్టీసీ యాజమాన్యాన్ని పలుమార్లు కలిసి సమస్యలను వివరించినప్పటికీ, హామీలు అమలు కాలేదని చెప్పారు. ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించిన నిధులతో నడుస్తున్న తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో కూడా రిటైర్డ్ ఉద్యోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల మంది రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కో ఉద్యోగికి సగటున రూ. 8 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. ఈ బకాయిలు అందకుండానే ఇప్పటికే 300 మందికి పైగా ఉద్యోగులు మరణించారని పేర్కొన్నారు. గతంలో ఉద్యోగులకు లగ్జరీ, సూపర్ లగ్జరీ, సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉన్న ఉచిత, రాయితీ ప్రయాణ సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఆర్టీసీకి ఆదాయం పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వం వెంటనే బకాయిల చెల్లింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, లేకపోతే ఆగస్టు 4న జలభవన్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు ఏవైనా ఇబ్బందులు లేదా ప్రాణనష్టం జరిగినా అందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

## పీఏసీఎస్ చైర్మన్‌కు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ స్థాయి పురస్కారం

బెస్ట్ సర్వీస్ సొసైటీ చైర్మన్ అవార్డుతో సోమ శాంత కుమార్‌కు ఘన సత్కారం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహాముత్తారం పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంత కుమార్‌కు 'బెస్ట్ సర్వీస్ సొసైటీ చైర్మన్' అవార్డు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సోమ శాంత కుమార్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు తెలంగాణ, గోవా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అధ్యక్షులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సోమ శాంత కుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణకు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. సోమ శాంత కుమార్‌కు అవార్డు లభించడం పట్ల మహాముత్తారం మండల ప్రజలు, పీఏసీఎస్ సభ్యులు, వివిధ వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## పిఆర్సి ప్రకటించకుంటే ఆందోళనకు సిద్ధం

- టీఎస్ యుటిఎఫ్ నేతల హెచ్చరిక



**వనపర్తి ప్రతినిధి, జులై 26 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న పిఆర్ సి ప్రకటించడం లేదని, దీనిపై తాత్సారం చేస్తే పోరాలకు సిద్ధమని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రవి ప్రసాద్ గౌడ్, డి.కృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం హైస్కూల్లో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలో పి ఆర్ సి ని ప్రకటిస్తామని హామీ ఇచ్చారని, మూడు సంవత్సరాలు కావస్తున్నా నేటికి ఆ ఊసే లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికే ఆరు విడతలుగా డిఎలు పెండింగ్ లో ఉన్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లాగే ఓపిఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతుందని, ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు చేయాలని ఎన్నిసార్లు ఆందోళన చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన హెల్త్ కార్డులలో అనేక లోపాలున్నాయని అన్నారు. ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, ప్రమోషన్లు ప్రక్రియ చేపట్టాలని కోరారు. జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేష్, కే.జ్యోతి, జిల్లా కోశాధికారి తిమ్మప్ప, జిల్లా కార్యదర్శులు పి.శ్రీని వాస్ గౌడ్, యండి.హామీద్, జి.మురళి, లక్ష్మణ్ నాయక్, బి.అరుణ, ఏ.వెంకటేష్, శివ శంకర్, ఆంజనేయులు, లక్ష్మణ్ గౌడ్, సుబ్బాస్, డి.రాము, మద్దిలేటి, నిరంజన్, శ్రీరాం, కౌసల్య, చిన్నస్వామి, బి.వెంకటేష్, జి.రాజ శేఖర్, వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా
# మెరుగైన మౌలిక సదుపాయాలు

బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద

స్వేత శుభం సొసైటీ నివాసులతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం






**కుత్బుల్లాపూర్, జూలై 26 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కొంపల్లి మున్సిపల్ సర్కిల్ వార్డు నం. 288 పరిధిలోని స్వేత శుభం సొసైటీని బీఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ అభివృద్ధికి ఎమ్మెల్యే అందించిన సహకారం, నిరంతర మద్దతుకు నివాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సొసైటీలో తాగునీటి సరఫరా, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, మెట్రో ఫ్లైఓవర్ పనులు నెమ్మదిగా కొనసాగుతున్న అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ వాసుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సొసైటీకి అనుసంధానంగా నిర్మించనున్న రహదారికి ఇప్పటికే పరిపాలనా అనుమతి లభించిందని, త్వరలోనే ఆ పనులకు ప్రారంభిస్తామని తెలిపారు, అలాగే జయభేరి పార్కులో పికిల్ బాల్ వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చేయిస్తానని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం తన బాధ్యతగా భావిస్తూ, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, ఇంజనీరింగ్ మరియు వాటర్ వర్క్ శాఖా అధికారులు, సొసైటీ చైర్మన్ సృజన రెడ్డి, ఉపచైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సెక్రటరీ రమేష్ కుమార్, కోశాధికారి శివ కుమార్ రెడ్డి, డైరెక్టర్లు ఆచ వినయ్, సభ్యులు జోగారావు, దామోదర్, సుప్రజిత్, వాణి, సొసైటీ వాసులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే





**జమ్మికుంట, జూలై 26 (సింగిడి):** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. వీణవంక మండలంలోని ఎల్బాక గ్రామంలో పోలు శ్రీనివాస్ తండ్రి వెంకటరాజం ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులు అర్పించిన కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. ఈ కార్యక్రమంలో వంతడుపుల మాజీ సర్పంచ్ కంది దిలీప్ రెడ్డి బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు జెకె జోడు కుమారస్వామి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సుధాకర్ రావు మాతృమూర్తి ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 29న సాయి సన్నిధిలో గురుపూర్ణిమ మహోత్సవాలు



**చింతపల్లి, జూలై 26 (సింగిడి):** మండల కేంద్రంలోని షిరిడి సాయి బాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన గురుపూర్ణిమ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య తెలిపారు. గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రభాత భేరి,గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యాధివాసం, వేద పారాయణం, నవగ్రహ పూజ, ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, గురుపూజ, సాయి గీతా చింతన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డోలోత్సవం, ధూపహారతి, శేజ్ హారతి వంటి విశేష సేవలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురుపూర్ణిమ రోజు ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ మహోత్సవంలో పాల్గొనే భక్తుల కోసం ప్రత్యేకంగా తాగునీరు, అన్నదానం, ప్రసాదం, పార్కింగ్ తదితర సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. గురుపూర్ణిమ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ షిరిడి సాయిబాబా ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
27-7-2026




## రాహుల్‌గాంధీ నాయకత్వానికి మద్దతుగా..
# విజయోత్సవ ర్యాలీ

- భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, జులై 26(సింగిడి):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికి దారితీసిన పోరాటంలో విద్యార్థులు,యువతకు అండగా నిలిచి కీలక పాత్ర పోషించిన గౌరవ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వానికి మద్దతుగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ మరియు అవకతవకలపై దేశవ్యాప్తంగా విద్యార్థుల తరపున లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు,పరీక్షా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఆ ఉద్యమం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై నిరసన వ్యక్తం చేస్తూ రాహుల్ గాంధీ నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. ఆందోళనల సందర్భంగా రాహుల్ గాంధీతో పాటు పలువురు విద్యార్థులు గాయపడినప్పటికీ వెనక్కి తగ్గకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగించారని, వారి పట్టుదల వల్లే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశాల్లో జవాబుదారీతనం,పారదర్శకత ఉండేలా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఈ విజయోత్సవ ర్యాలీ విద్యార్థుల ఐక్యతకు, ప్రజాస్వామ్య పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, విద్యార్థులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# సాగర్ నీటిని కోదాడ చెరువులకు విడుదల చేయాలి

- ఉమ్మడి జిల్లా రైతుల నోట్లో మట్టి కొట్టిన మంత్రి ఉత్తమ్
- వారం రోజులలో సాగునీరు ఇవ్వకుంటే ఉద్యమమే
- గణపవరంలో రైతుల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం



**కోదాడ రూరల్,జూలై 26(సింగిడి):** సాగర్ ప్రాజెక్టులో నీళ్లు డెడ్ స్టోరేజీలో ఉన్న నేపద్యంలో ఉమ్మడి జిల్లాలో రైతులు నార్లకు నీళ్లు లేని దుస్థితిలో ఏకంగా సాగర ప్రాజెక్టు నుండి తాగునీటి అవసరం కోసం ఖమ్మం జిల్లా పాలేరుకు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నీటిని విడుదల చేయించి రైతుల నోట్లో మట్టి కొట్టాడని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు... ఆదివారం మండల లోని గణపవరం స్టేజి వద్ద చుట్టుపక్కల గ్రామాల రైతులు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు... జూన్ 25న రోజుకు 4000 క్యూసెక్కుల నీటిని ఖమ్మానికి తరలిస్తుంటే మంత్రి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ రైతులను దగా చేశారని తీవ్ర స్థాయిలో విమర్శించారు.. ఇప్పటికే సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లా చెరువులకు పాలేరు లింకు ద్వారా నీళ్లు చేరుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.. అయితే ఉమ్మడి జిల్లాలో ఆయకట్టు చివర్లో ఉన్న కోదాడ లోని చెరువులకు నీటిని విడుదల చేయడంలో మంత్రి విఫలమయ్యారని విమర్శించారు.. ఖమ్మం జిల్లా మంత్రి తుమ్మలకు ఉన్న సోయి ఈయనకు లేకపోవడం మన దురదృష్టం అన్నారు.. ఇది ఇలా ఉంటే ఎత్తిపోతల పథకాల పేరుతో కాంట్రాక్టులు ,కమిషన్లకే ఆయన పరిమితమయ్యా రన్నారు.. ఎత్తిపోతల పథకాలు, అభివృద్ధి పనుల లో కమిషన్లు కాంట్రాక్టులపై ఉన్న మమకారం రైతులపై చూపించకపోవడం దుర్మార్గమన్నారు.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి వేదికలపై ఉపన్యాసాలకు పరిమితమై ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అన్ని వర్గాల ప్రజలను వంచిస్తున్నారని ధ్వజమెత్తారు.. నియోజకవర్గ రైతులకు వారంలోగా తాగు, సాగునీరు అందించి చెరువులన్నిం టిని నింపాలని లేదంటే ప్రజల పక్షాన తానే స్వయంగా నిరాహార దీక్ష చేపట్టడంతో పాటు రైతులు ప్రజలతో కలిసి ఉద్యమాన్ని నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి పోరాటానికైనా వెనుకాడబోమన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా గ్రామాల నాయకులు పొట్ట కిరణ్ , జాబిశెట్టి చంద్రమౌళి, అంజిరెడ్డి వేలాద్రి తోపాటు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని పూజలు



**యాదాద్రి భువనగిరి , జూలై 26(సింగిడి):** భువనగిరి పట్టణంలో నీటి కరువు ముప్పు ముంచుకొస్తుంది. జూన్ లో నైరుతి రుతుపవనాలు వర్షాలు రావలసిన మాసంలో చినుకు రాలక పోవడం వలన భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటు పోతున్నా యి. ఇప్పటికే త్రాగు నీటికి కొరత ఏర్పడింది. ఆగస్టు నెల సమీపిస్తున్న జలాశయాలు అడుగంటి పోతున్నాయి. ఎలినో కరువు ప్రభావం పట్టణ ప్రజలను వెంటాడుతుంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో రైతులు, పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్న వేళ వాన దేవుడా.... కరుణించవయ్యా అంటూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు గుండెబోయిన సురేష్-- ప్రియాంక యాదవ్, వార్డు అధ్యక్షుడు హరికిషన్ గౌడ్, పట్టణ మహిళ విభాగం రత్నపురం పద్మ ఆధ్వర్యంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా నీటి బిందెలతో బోడురాయికి జలాభిషేకం చేశారు. అనంతరం బ్రాహ్మణవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి, అలాగే పెద్దవాడ పోచమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మంచి వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వర్షాభావంతో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. భూమాత దాహం తీరేలా, పంటలు పుష్కలంగా పండేలా ప్రకృతి అనుగ్రహం కలగాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన అంజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏ. వి. కిరణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్, మహిళా నాయకులు, వార్డు మహిళలు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉదయ్ ఆర్ట్ త్రీడీ క్యారీ గ్యాలరీ ప్రారంభోత్సవం



**అల్వాల్, జూలై 26 (సింగిడి):** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి మచ్చబొల్లారం డివిజన్‌లోని ఐస్ ఫ్యాక్టరీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఉదయ్ ఆర్ట్ 3ఐ కార్వింగ్ గ్యాలరీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యాలరీ నిర్వాహకుడు శ్రీ ఉదయ్ సోమ మరియు వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి నూతన వ్యాపార సంస్థలు మరిన్ని ఏర్పడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్, అరుణ్ రావు, భాస్కర్ రెడ్డి, పవన్, రేవంత్, మహేష్, రెహ్మత్ ఖాన్, నార్ల సురేష్, నర్సింగ్ రావు, గణేష్, దేవేందర్, ఫెరోజ్, అతిక్ పాషా, బంటి, వర్షా, అభిమానులు, కుటుంబ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**కుత్బుల్లాపూర్, జూలై 26 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 274వ డివిజన్ బాచుపల్లి లోని ఎస్ వి ఎస్ అబర్న కాలనీలో రూ. 23 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభోత్సవం నిర్వహించారు. కాలనీలో ఉన్న సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గత నెలలో స్థానికులు కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి, ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో (సిఎంసి ) రూ. 23 లక్షల నిధులను మంజూరు చేయించి ఆదివారం అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కొలన్ హన్మంత్ రెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి, తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా సేవే లక్ష్యంగా ప్రజల కోసం పనిచేస్తా..

- సొంటి రెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 26 (సింగిడి):** ఓటు హక్కు అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలను సరిచూసుకుని, అవసరమైన మార్పులు చేసుకోవాలని విజ్ఞప్తి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి తెలిపారు. బి.ఎల్.ఓ.లు ఓటర్ మహాశయుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలుస్తూ, బి.ఎల్.ఓ.లతో మాట్లాడి వారి సమస్యలు, సూచనలు, ఓటరు జాబితాకు సంబంధించిన ఇబ్బందులను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పనిచేస్తామని, ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మరలింగ, పవన్,శ్రీనివాస్ గౌడ్, హర్భజన్ సింగ్, శ్రీనివాసరెడ్డి , కాంగ్రెస్ నాయకులు, ఓటర్ మహాసేలు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాలో విద్యార్థులదే విజయం

- మోడీ నిరంకుశ పాలనకు కూడా కచ్చితంగా చరమగీతం పాడుతాం
- ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు వేమన




**భూపాలపల్లి, జులై 26 (సింగిడి):** కేంద్రంలో సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ భవన్లో జరిగిన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాజకీయ విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు వేమన గారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ దేశంలో 12 ఏళ్లుగా నియంతృత్వంతో నిరంకుశంగా పాలిస్తున్న మోడీ సర్ గారికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పెద్ద చెంప పెట్టని ఈ దేశాన్ని ఉన్మాదంగా మతరాజ్యంగా తయారు చేయాలని విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు మోడీ ధర్మేంద్ర ప్రధాన్లు నిర్ణయించుకొని విద్యను నిర్వీర్యం చేయాలని ఉద్దేశంతోనే నీట్ పేపర్ లీకేజీలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యాన్ని కొనసాగించిందని దాని పర్యావసనం 30 మంది విద్యార్థులు మరణించారని అంతే కాకుండా జంతర్మంతర్లో జరిగినటువంటి పార్లమెంట్ మార్చిలో అమానుషంగా పాశవికంగా వ్యవహరిస్తూ విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన దృశ్యాల్ని మేము ఇంకా మర్చిపోలేదని దానికి తగిన గుణపాఠం త్వరలోనే చెబుదామని నీట్ పేపర్ లీకేజీ పైన బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ చేసిన రాజీనామా కేవలం విద్యార్థుల పోరాట విజయమేనని ఇది ఆరంభం మాత్రమే రానున్న రోజులలో విద్యా వైద్య వ్యవస్థల్లో రాజకీయ సామాజిక ఆర్థిక అసమానతలను దూరం చేయాలని రచించబడిన రాజ్యాంగాన్ని పట్టుకొని ఈ దేశంలో నియంతృత్వ పోకడలను కొనసాగిస్తున్నటు వంటి మోడీ నిరంకుశ పాలనకు త్వరలోనే చర్మ గీతం పాడేందుకు ఐసా విద్యా సంఘం జంతర్మంతర్ పోరా టానికి ఏ విధమైన కీలకపాత్రను పోషించిందో భవిష్యత్తులో దేశంలో మోడీ సర్కార్ని గద్ద దింపే దానికోసం ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థి సంఘం విద్యార్థుల్ని యువకుల్ని ఆలోచించే విధంగా పోరాటాన్ని రూపొందించి దానికి చరమగీతం పాడేందుకు కీలక పాత్ర పోషిస్తుందని ఈ భూపాలపల్లి జిల్లాలో కూడా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న జిల్లా కమిటీకి జాతీయ కమిటీ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నామని వారికి మా అండ జాతీయ కమిటీ సహకారం ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ నిర్మాణ బాధ్యతలు మూర్తి గారు రాష్ట్ర నిర్మాణ బాధ్యతలు మామిళ్ల రమేష్ రాజా , జిల్లా నిర్మాణ బాధ్యతలు మారపల్లి మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జమ్మి అశోక్, జార్జి రెడ్డి పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్,జిల్లా కార్యదర్శి బందు సుజాత అధ్యక్షులు బుర్ర స్వాతి నాయకులు లవన్ రుద్రమరాజు విష్ణు మనోజ్ అభినయ్ పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్‌కు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ స్థాయి పురస్కారం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహాముత్తారం పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంత కుమార్‌కు 'బెస్ట్ సర్వీస్ సొసైటీ చైర్మన్' అవార్డు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సోమ శాంత కుమార్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు తెలంగాణ, గోవా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అధ్యక్షులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సోమ శాంత కుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణకు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. సోమ శాంత కుమార్‌కు అవార్డు లభించడం పట్ల మహాముత్తారం మండల ప్రజలు, పీఏసీఎస్ సభ్యులు, వివిధ వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.



## వంతెనపై భారీ గుంత..



**కాటారం, జూలై 26(సింగిడి):** మండలంలోని కాటారం శివారులో గల కాటారం-మంథని ప్రధాన జాతీయ రహదారి వంతెనపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై తారు పూర్తిగా దెబ్బతిని కంకర తేలిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో వాటి లోతు అంచనా వేయలేక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వంతెన మీదుగా ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెనపై ఏర్పడిన భారీ గుంతలను వెంటనే పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రైతు వేదికలో మూడు రోజుల పాటు విత్తన మేళా

**కాటారం, జూలై 26(సింగిడి):** మండలంలోని రైతు వేదికలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరితో పాటు కంది, పెసర, మినుము, మొక్కజొన్న, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మేళాలో నాణ్యమైన విత్తనాలతో పాటు తక్కువ నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ నిపుణులు సలహాలు అందించనున్నట్లు తెలిపారు. మండల రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం అందజేత



**హుజుర్నగర్ (మఠంపల్లి), జూలై 26 (సింగిడి):** మానవత్వానికి మతం, కులం లేదని మరోసారి చాటి చెబుతూ సర్వ మత సామాజిక సేవ సంఘం సభ్యులు ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి వైద్యానికి రూ. 30 వేల ఆర్థిక సహాయం అందించి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల పరిధిలోని పెదవీడు గ్రామానికి చెందిన షేక్ ఆసిఫా వయసు (9) ఇటీవల డెంగ్యూ జ్వరానికి గురైంది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే తీవ్ర పేదరికంలో ఉన్న కుటుంబం ఆస్పత్రి ఖర్చులు,వైద్య బిల్లులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న సర్వ మత సామాజిక సేవ సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ వహాబ్, కౌసర్ మసీదు కమిటీ మాజీ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ ఆదివారం ఖమ్మంలోని ఆస్పత్రికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చిన్నారి త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజంలో ఆపదలో ఉన్న వారికి తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చిన్నారి ఆసిఫా భవిష్యత్తు చదువులకు కూడా సంఘం తరఫున అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అనంతరం మాజీ చైర్మన్ మాట్లాడుతూ అవసరమైతే చిన్నారికి మరింత ఆర్థిక సహాయం కూడా అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. సంఘం ద్వారా చేపట్టిన ఈ దాతృత్వ కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు. మానవత్వంతో ముందుకొచ్చి చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సహాయం చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు షేక్ ఇమామ్, షేక్ జానీ భాష,ముస్లిం యూత్ కమిటీ సభ్యులు సయ్యద్ ఉమర్,సమీర్,సుభాని పాల్గొన్నారు.

## అమృత్ 2.0 పనులను పరిశీలించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, జూలై 26 (సింగిడి):** మిర్యాలగూడ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రతి ఇంటికి 24 గంటల పాటు నాణ్యమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేస్తున్న అమృత్ స్కీమ్ 2. 0 పనులను ఆదివారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద దేవులపల్లి వద్ద అమృత్ 2. 0 పథకం కింద నిర్మిస్తున్న నూతన పంప్ హౌస్నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులనుపబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులోపు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్‌రాజ వెంకటేశ్వర్లు , ఇతర అధికారులు, కాంట్రాక్టర్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ పట్టణ, మండలాల అధ్యక్షులను ప్రకటించిన పీసీసీ చీఫ్

**మిర్యాలగూడ, జూలై 26 (సింగిడి):** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ వన్ టౌన్ టూ టౌన్, మండలాల పార్టీ, వేములపల్లి, దామరచర్ల అధ్యక్షులను ఖరారు చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత తో సంప్రదించి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మిర్యాలగూడ వన్ టౌన్ అధ్యక్షులుగా కోడి రెక్క ఇంద్ర కుమార్, బంగారుగడ్డ 32వ వార్డు కౌన్సిలర్ టూ టౌన్ అధ్యక్షులుగా ఎండి హమీదుద్దీన్ (మోయిజ్) నియమించారు. అదేవిధంగా మిర్యాలగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా గుండు నరేందర్ గౌడ్ (మాజీ సర్పంచ్), దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కుర్ర నాగు నాయక్ (మాజీ సర్పంచ్) వేములపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా ఆర్ రవీందర్ రెడ్డి (మాజీ సర్పంచ్) లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఎన్నికైన అధ్యక్షులు కృషి చేయాలని కోరారు. ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులను మిర్యాల గూడ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఇది కప్పు తింటే చిటికెలో

## ఒంటి నొప్పులు మాయం..



మినుములతో ఇలా చేసి తింటే ఎన్నో నొప్పులు తగ్గుతాయి. ఇంకా వీటిలో క్యాల్షియం, ఐరన్ ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని పెంచి కండరాలకు కూడా బలాన్ని ఇస్తాయి. ఇంకా పూర్వకాలంలో ప్రసవం తర్వాత వచ్చే నడుము నొప్పులకు ఈ మినుములతో చేసిన వంటకాలు వారికి వండి పెట్టేవాళ్లు.

ఇంకా దీన్ని తినడం వలన వెన్నెముక గట్టిగా అవుతుంది. దీనితో స్వీట్ చేసుకుని తింటే కమ్మగా ఉంటుంది. మినపప్పు, బెల్లం, పాలు వేసి ఈజీగా చేసుకుని తినొచ్చు. కండరాల సమస్యను కూడా తగ్గిస్తుంది. మరి, ఇంకెందుకు లేట్ దీనికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం గురించి ఇక్కడ చదివి తెలుసుకుందాం..

**కావలసిన పదార్థాలు:**
రెండు కప్పుల కప్పు మినుములు, రెండు కప్పుల పాలు, బెల్లం తురుము, పంచదార, రుచికి తగినంత ఉప్పు, మూడు టేబుల్ స్పూన్స్ నెయ్యి, 10 బాదం పప్పు, 5 కిస్‌మిస్, అర టేబుల్ స్పూన్ యాలకుల పొడిని టేస్టీగా ఉంటుంది. అయితే, మీరు వీటిని చేసేటప్పుడు బాగా వేయించి వీటిని తీసుకోవాలి. ముందుగా నల్ల మినుములను తీసుకుని ఒక పాన్ లోవేసి వాసన వచ్చే వరకు వేయించుకోవాలి. ఆ తరవాత వీటిని కొద్దిసేపు చల్లార్చి మిక్సీలో వేసి బరకగా చేసుకోవాలి. ఇప్పుడు ఒక పాత్ర తీసుకుని దానిలో ఈ మినుముల రవ్వ వేసి ఉడికించాలి. అయితే, అడుగంటకుండా దీనిని గరిటెతో కలుపుతూ ఉండాలి.

ఈ రవ్వ ఉడికిన తర్వాత దానిలో బెల్లం వేయాలి. పంచదార కంటే బెల్లం వేస్తే మంచిది శరీరానికి ఐరన్ కూడా దొరుకుతుంది. ఇంకా టేస్ట్ కోసం అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి, నెయ్యిలో వేయించిన జీడిపప్పు , పచ్చి కొబ్బరి తురుము కూడా కలిపితే బలమైన మినుముల స్వీట్ రెడీ. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు దీనిని తినొచ్చు.

## వంద రోగాలకు ఒక్కటే మందు..

### ఒంట్లో వండర్స్ సృష్టించాలంటే ఈ కాయల వల్లే సాధ్యం..

ఇది జీర్ణవ్యవస్థ పనితీరును కూడా మెరుగుపరుస్తుంది అలాగే ఆకలిని కూడా పెంచుతుంది. ఈ వాక్కాయలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు పాత కాలంలో జ్వరం వస్తే ఇదే తీసుకునేవాళ్ళు ఇంకా దీనిలో యాంటీఆక్సిడెంట్స్ కూడా ఉంటాయి. ఇవి అంటు వ్యాధులతో పోరాడతాయి. జ్వరాన్ని తగ్గించడంలో ఇవి హెల్ప్ చేస్తాయి.

ఇవి ఎక్కువగా వానాకాలంలోనే దొరుకుతాయి ఇంకా ఈ సీజన్ లో దొరికే వాక్కాయను ఆహారంలో తీసుకోవడం వలన ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇంకా



దీనిలో విటమిన్లతో పాటు మెగ్నీషియం కూడా ఉంటుంది. ఇది సిరోటోనిన్ ను ఉత్పత్తి చేయడంలో హెల్ప్ చేస్తుంది.

**వాక్కాయ జ్యూస్...**
మీరు ఈ వాక్కాయ జ్యూస్ తాగడం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుంది ఇది ఎంతో మేలు చేస్తుంది కూడా. ఇంకా ఇవి గుండె కండరాలను కూడా బలపడేలా చేస్తుంది. ఇంకా మీరు రోజూ 15 మి.లీ వాక్కాయ రసం తీసుకుంటే తక్షణ శక్తిని ఇస్తుంది. మీ బాడిలోని మంటను కూడా ఇది పూర్తిగా తగ్గిస్తుంది. ఇంకొందరు దీనిని పప్పులాగా చేసుకుని తింటారు.

# ఫ్రోజెన్ ఫుడ్‌తో జర జాగ్రత్త.!

### మీ వంటగదిలో అస్సలు ఉండకూడని ఆహార పదార్థాలు.. యమ డేంజర్..!

ఎక్కువ కాలం నిల్వ ఉండేలా ప్రాసెస్ చేయబడిన ఆహారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. వీటిలో సోడియం, ప్రిజర్వేటివ్‌లు, ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉండవచ్చు. వీటిని తరచుగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు, గుండె ఆరోగ్యం, జీర్ణవ్యవస్థ ప్రభావితం కావచ్చు. ఈ 7 రకాల నిల్వ ఉండేలా ప్రాసెస్ చేసిన ఆహారాలు ప్రమాదకరమైనవి. ఇవి మాత్రమే కాకుండా, ఏ ప్రాసెస్ చేసిన ఆహారమైనా అధిక ప్రమాదకరమే. మార్చి 19, 2026న అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తినడం గుండె ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని తేలింది. చిప్స్, ఫ్రోజెన్ మీల్స్, చక్కెర పానీయాలు, ప్యాక్ చేసిన స్నాక్స్ వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తినే వ్యక్తులకు గుండెపోటు, పక్షవాతం లేదా గుండె జబ్బులతో మరణించే ప్రమాదం గణనీయంగా ఎక్కువగా ఉంటుంది.




అమెరికాలో నిర్వహించిన ఒక పెద్ద అధ్యయనంలో రోజుకు సుమారు 9 సేర్విన్స్ అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినే వ్యక్తులకు, కేవలం ఒక సేర్విన్గ్ తినేవారితో పోలిస్తే గుండెపోటు లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం 67 శాతం ఎక్కువగా ఉందని తేలింది. అలాగే ప్రతి అదనపు సేర్విన్గ్‌కు ఈ ప్రమాదం 5 శాతానికి పైగా పెరిగింది. మొత్తం కేలరీలు, ఆహార నాణ్యత, సాధారణ ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఈ ఫలితాలు మారలేదు. అలాగే, నిల్వ ఉంచి ప్రాసెస్ చేసిన ఆహారం ఎంత ప్రమాదకరం అనేవి నివేదికలు చెబుతున్నాయి.

**ఫ్రోజెన్ పరాటాలు:**



తీరిక లేని రోజుల్లో దుకాణాల్లో అమ్మే ఫ్రోజెన్ పరాటాలు చాలా సౌకర్యవంతంగా అనిపించవచ్చు. అయితే, వాటిని పిండితో తయారు చేస్తారు. వాటిలో పీచుపదార్థం చాలా తక్కువగా ఉంటుంది. వాటిలో అధిక మొత్తంలో ఉప్పు, నిల్వచేసే పదార్థాలు కూడా ఉండవచ్చు. వాటిని తరచుగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, బరువు పెరగడం, రక్తపోటు సమస్యలు వంటివి తలెత్తవచ్చు. ఇంట్లో తయారుచేసుకున్న పరాటాల కంటే ఇవి తక్కువ ఆరోగ్యకరమైనవి.

**ఫ్రోజెన్ ఫ్రెంచ్ ఫ్రైస్:**

ఫ్రోజెన్ ఫ్రెంచ్ ఫ్రైస్ చాలా మందికి, ముఖ్యంగా పిల్లలకు చాలా ఇష్టమైనవి. వీటిని త్వరగా వండుకోవచ్చు కాబట్టి ఇంట్లో తరచుగా



వాడుతుంటారు. అయితే, ఇవి నూనెలో ముందుగా వేయించి ఆ తర్వాత గడ్డకట్టించిన ప్రాసెస్ చేసిన బంగాళాదుంపలు. వీటిలో సోడియం, ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. వీటిని తినడం తాత్కాలికంగా రుచిగా అనిపించవచ్చు. కానీ అవి శరీరానికి పోషకాలను అందించవు. వీటిని ఎక్కువగా తినడం వల్ల బరువు పెరగడం, గుండె సమస్యలు పెరిగే అవకాశం ఉంది. ఇది పిల్లలకు అలవాటుగా మారితే అది వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది

**ప్రాసెస్ చేసిన మాంసం:**

ఎక్కువ కాలం పాడవకుండా నిల్వ చేసే మాంసంలో ప్రోటీన్ ఉంటుంది కాబట్టి అది ఆరోగ్యకరమైనదని చాలా మంది భావిస్తారు. అయితే, దీనిని తరచుగా సోడియం, నిల్వచేసే పదార్థాలు కలిపి ఎక్కువ కాలం నిల్వ ఉంచుతారు. కొన్నిసార్లు, ఇందులో సంతృప్త కొవ్వులు కూడా అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తినడం వల్ల అధిక రక్తపోటు, గుండె సమస్యల ప్రమాదం పెరగవచ్చు. దీర్ఘకాలంలో ఇది దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. తాజా మాంసంతో పోలిస్తే నిల్వ చేసిన మాంసం పోషక విలువ కొంత తక్కువగా ఉంటుంది.

**ఫ్రోజెన్ పాస్తా:**

ఫ్రోజెన్ పాస్తాలో కూరగాయలు ఉండటం వల్ల అది ఆరోగ్యకరంగా అనిపించవచ్చు. కానీ దానిలో క్రీమ్, నూనె మరియు సోడియం అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఇందులో నిల్వచేసే పదార్థాలు కూడా ఉంటాయి. ఈ ఆహారాలు తాత్కాలికంగా రుచిగా అనిపించినప్పటికీ, అవి శరీరం నుండి పోషకాలను క్షీణింపజేస్తాయి. వీటిని తరచుగా తినడం వల్ల బరువు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు అస్థిరంగా ఉండటం, జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు.

**ఫ్రోజెన్ శాండ్‌విచ్‌లు:**
ఫ్రోజెన్ శాండ్‌విచ్‌లను త్వరిత అల్పాహారంగా లేదా స్నాక్‌గా ఉపయోగిస్తారు. వీటిలో ప్రాసెస్ చేసిన మాంసం, చీజ్, సాస్‌లు, పిండితో చేసిన బ్రెడ్ అధికంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల కడుపు నిండినట్లు అనిపించినప్పటికీ, ఇవి జీర్ణం కావడానికి కష్టంగా ఉంటాయి. వీటిని తరచుగా తినడం వల్ల గ్యాస్, అజీర్ణం, రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగడం వంటి సమస్యలు వస్తాయి. వీటిలో ప్రిజర్వేటివ్‌లు అధికంగా ఉంటాయి. ఇవి దీర్ఘకాలంలో శరీరానికి హానికరంగా మారవచ్చు.



**వేపుడు కూరగాయలు:**

నిల్వ ఉంచిన వేపుడు కూరగాయలను వండటం సులభం. అయితే, వాటిలో తరచుగా సాస్‌లు, ఉప్పు అధికంగా ఉంటాయి. కొన్నిసార్లు వాటిలో చక్కెర కూడా ఉంటుంది. వీటిని తినడం వల్ల కూరగాయలలోని పోషకాలు తగ్గిపోతాయి. వీటిని తరచుగా తినడం వల్ల జీర్ణ సంబంధిత రుగ్మతలు, గుండె ఆరోగ్య సమస్యలు, రక్తంలో చక్కెర సమస్యలకు దారితీయవచ్చు.



**వాఫిల్స్:**

చాలా మంది అల్పాహారంగా లేదా డెజర్ట్‌గా వాఫిల్స్ తినడానికి ఇష్టపడతారు. వీటిని తరచుగా పిండితో తయారు చేస్తారు. వీటిలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. వీటిపై చాక్లెట్ సిరప్, తేనె వంటివి కలపడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగవచ్చు. వీటిలో కృత్రిమ రుచులు, నిల్వచేసే పదార్థాలు కూడా ఉండవచ్చు. వీటిని తరచుగా తినడం వల్ల అకస్మాత్తుగా శక్తి పెరిగి, ఆ తర్వాత అలసట రావచ్చు.

**మొత్తమ్మీద ప్రాసెస్ చేసిన ఆహారాలు**

సౌకర్యవంతంగా ఉండవచ్చు. కానీ వాటిలో దాగి ఉన్న ఉప్పు, కొవ్వు, నిల్వచేసే పదార్థాలు శరీరానికి హానికరంగా ఉంటాయి. వీలైనంత వరకు తాజా ఆహారాలు తినడం ఆరోగ్యానికి మంచిది. ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా దీర్ఘకాలంలో ఆరోగ్యంపై పెద్ద ప్రభావాలను చూపుతాయి. అందుకే వీలైనంత వరకు అటువంటి ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది.

## ఏఐ రంగంపై ప్రజలకు నమ్మకం పోతోంది: సత్యనాదెళ్ల

ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగం పై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు.

ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను



వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకతకు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు.

2030 కల్లా 2 లక్షల కోట్ల డాలర్లకు కంప్యూట్ మార్కెట్‌పై ఏఎమ్‌డీ అంచనా

ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

## గగనతలం నుంచే నిఘా




దేశీయ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ కీలక అడుగు వేసింది. శత్రువుల కదలికలను గగనతలం నుంచే పసిగట్టే అత్యాధునిక 'ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్' మార్క్-2 వ్యవస్థల సంయుక్త అభివృద్ధి కోసం అదానీ డిఫెన్స్, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా 6 ఎయిర్‌బస్ ఏ321 విమానాలను అత్యాధునిక మిషన్ వ్యవస్థలతో తీర్చిదిద్దుతారు. వీటికి దాదాపు 30 ఏళ్లపాటు సమగ్ర లాజిస్టిక్స్, మరమ్మతులు, సాంకేతిక తోడ్పాటును ఈ భాగస్వామ్య సంస్థలే అందిస్తాయి. వీటిని 2032-33 నాటికి వాయు సేనలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. గగనతల నిఘా పరిధి పెంచడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ వ్యవస్థ దోహదం చేయనుంది.

'నేత్ర' విజయంతో...:
బెంగళూరులోని సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్ (సీఏబీఎస్) అభివృద్ధి చేసిన 'నేత్ర' నిఘా వ్యవస్థ విజయవంతం కావడంతో, తయారీకి గత నెలలో తుది అనుమతులు లభించాయి. ఈ స్ఫూర్తితోనే తదుపరి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గగనతలంలో వేల మీటర్ల ఎత్తు నుంచి పర్యవేక్షించే ఈ వ్యవస్థల వల్ల 'సరిహద్దుల్లో తక్కువ ఎత్తులో వచ్చే ముప్పులనూ ముందే పసిగట్టడం' వీలవుతుంది. ఈ సాంకేతికతతో అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, చైనా, స్వీడన్ సరసన భారత్ చేరనుంది.

స్వదేశీ టర్బోజెట్ ఇంజిన్: రక్షణ రంగంలోని హైదరాబాద్ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్, డీఆర్‌డీఓ భాగస్వామ్యంతో కలిసి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఎక్స్‌పెండబుల్ టర్బోజెట్ ఇంజిన్ తయారు చేసింది. 350 కేజీల థ్రస్ట్ క్లాస్ సామర్థ్యం ఉన్న ఈ ఇంజిన్ డీఆర్‌డీఓ విభాగానికి చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్‌ఈ) రూపకల్పన చేసింది. ఆజాద్ ఇంజినీరింగ్ 24 నెలల వ్యవధిలో దీనిని తయారు చేసి, అప్పగించింది. ఈ టర్బోజెట్ ఇంజిన్లను యాంటీ-షిప్ క్షిపణులు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలు, మానవరహిత వైమానిక వాహనాల తయారీలో వినియోగించనున్నారు.

## స్మార్ట్‌ఫోన్లు మరింత భారం.. ప్రాసెసర్ ధరలు పెంచనున్న క్వాల్‌కామ్!

ప్రముఖ కంపెనీలు ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో సెమికండక్టర్ విభాగానికి డిమాండ్ పెరుగుతోంది. అదే స్థాయిలో మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రపంచ టెక్ కంపెనీలు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచేశాయి. ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ) కూడా చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కస్టమర్‌గా ఉన్న శాన్‌డియాగో కంపెనీ క్వాల్‌కామ్ కూడా తన ప్రాసెసర్ ధరలను




రెండంకెల శాతానికి పెంచుతుండటం గమనార్హం దీంతో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల ధరలు మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది.

వ్యయ ధరల పెరుగుదల కారణంగా క్వాల్‌కామ్ తన ప్రాసెసర్ ధరలను పెంచనున్నట్లు కొన్ని అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఖర్చుల భారాన్ని ఇకపై మోయలేమని కంపెనీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్వాల్‌కామ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ధరలు మండిపోతున్నాయి. క్రమంగా టీఎస్ఎంసీ, క్వాల్‌కామ్ కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచితే ఫోన్లు, ల్యాప్‌టాప్ ధరలు మరింత భారంగా మారనున్నాయి. కాగా, శాంసంగ్, షావోమి, వన్‌ప్లస్, మోటోరోలా వంటి పలు కంపెనీలకు క్వాల్‌కామ్ తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.

## ఇండియా పోస్ట్ - ఫ్లిప్‌కార్ట్ క్రేజీ డీల్.. గ్రామాల్లో ఇక తపాలా సిబ్బందే పార్సిల్ డెలివరీ!

దేశంలోని మారుమూల ప్రాంతాలకు డెలివరీ సామర్థ్యాలను పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేస్తూ, తపాలా శాఖ -- ఫ్లిప్‌కార్ట్ ఇండియా ఒక చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేశాయి.

తపాలా శాఖ, ఫ్లిప్‌కార్ట్ ఇండియా శుక్రవారం ఢిల్లీలో ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. తపాలా సాటిలేని విస్తృతి, విశ్వసనీయమైన డెలివరీ నెట్‌వర్క్, అలాగే భారతదేశ ఈ-కామర్స్ రంగంలో ఫ్లిప్‌కార్ట్‌కు ఉన్న బలమైన ఉనికిని ఉపయోగించుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా సమర్థవంతమైన, నమ్మకమైన, వినియోగదారుల-కేంద్రీకృత పార్సిల్ డెలివరీ పరిష్కారాలను అందించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం. ఈ ఒప్పందం ప్రకారం, తపాలా శాఖ భారతదేశవ్యాప్తంగా ఫ్లిప్‌కార్ట్ సరుకుల కోసం లాస్ట్-మైల్ డెలివరీ సేవలను అందిస్తుంది.

**ఒప్పందంలోని కీలక అంశాలు:**

ఫ్లిప్‌కార్ట్, మారుమూల, తక్కువ సేవలు అందుతున్న ప్రాంతాలతో పాటు పట్టణ, పాక్షిక పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పార్సిల్ డెలివరీ సేవల కోసం ఇండియా పోస్ట్ విస్తృతమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటుంది.
ఈ సేవల్లో ప్రీ-పెయిడ్, క్యాష్ ఆన్ డెలివరీ (జూణ) పార్సిళ్ల డెలివరీ, న్యూ ఆధారిత డెలివరీ ధృవీకరణ, రియల్-టైమ్




షిప్‌మెంట్ ట్రాకింగ్ వంటివి ఉన్నాయి.
ఈ ఒప్పందం సమర్థవంతమైన పార్సిల్ రవాణా, పంపిణీ కోసం వేగవంతమైన డెలివరీ, మెరుగైన కార్యాచరణ సమన్వయం, అంతరాయలు లేని సాంకేతిక ఏకీకరణపై దృష్టి సారిస్తుంది.
ఈ సహకారం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ రంగానికి మద్దతు ఇచ్చే లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.
ఆ కంపెనీకి తపాలా శాఖకు చెందిన 1.6 లక్షలకు పైగా పోస్ట్ ఆఫీసుల నెట్‌వర్క్‌ను వినియోగించుకునే అవకాశం లభిస్తుంది.
ఈ భాగస్వామ్యం ద్వారా ఫ్లిప్‌కార్ట్ భారతదేశవ్యాప్తంగా తపాలా శాఖకు చెందిన 1.6 లక్షలకు పైగా పోస్ట్ ఆఫీసుల విస్తారమైన నెట్‌వర్క్‌ను, సాటిలేని డెలివరీ నెట్‌వర్క్‌ను పొందగలుగుతుంది. ఇది మార్కెట్ పరిధిని విస్తరించడానికి, పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన సేవను అందించడానికి సహాయపడుతుంది.

**అమెజాన్ ఇప్పటికే ఇండియా పోస్ట్‌తో భాగస్వామ్యం:**

మారుమూల ప్రాంతాలకు సరుకులను చేరవేయడానికి అమెజాన్ ఇండియా గతంలో భారత తపాలా సేవతో భాగస్వామ్యం కుదుర్చుకుందని గమనించాలి. లాజిస్టిక్స్, ఇ-కామర్స్‌ను బలోపేతం చేయడానికి అక్టోబర్ 2024లో అమెజాన్, తపాలా శాఖ ఒక అవగాహన ఒప్పందం (మీూఖ)పై సంతకాలు చేశాయి.







## గ్లోబల్ మార్కెట్‌ల్లో నథింగ్ మూతపడుతోందా?..

### కంపెనీ క్లారిటీ



కొన్ని రోజుల్లో ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ నథింగ్.. ప్రపంచవ్యాప్తంగా డజన్‌కు పైగా మార్కెట్లలో మూతపడుతున్నట్లు కొన్ని టెక్ నివేదికలు చేస్తున్న ప్రచారాన్ని కంపెనీ ఖండించింది . మరోవైపు, 40 శాతం ఉద్యోగాల కోత చేపట్టనున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. దీనిపై నథింగ్ సహ వ్యవస్థాపకుడు అకిస్ ఎవాంజెలిడిస్ స్పందించారు. అవన్నీ తప్పుడు కథనాలని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

"జపాన్, యూరప్ వంటి పలు గ్లోబల్ మార్కెట్ల నుంచి నథింగ్ వైదొలుగుతున్నట్లు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. అవన్నీ వదంతులే. ఏ మార్కెట్ నుంచి కంపెనీ తప్పుకోవడం లేదు. తదుపరి వృద్ధికి కంపెనీ బృందాలను పునర్నిర్మిస్తున్నాం. ప్రత్యేకంగా ఒక ఏఐ నేటివ్ వ్యాపార యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నాం. ప్రాంతీయ హబ్‌లు మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మార్పుల్లో భాగంగా కొన్ని ఉద్యోగ స్థాయిలపై ఆ ప్రభావం పడుతుందన్న మాట వాస్తవమే. నిబంధనల ప్రకారం వాటి వివరాలను ప్రస్తుతానికి వెల్లడించలేం" అని ఆయన అన్నారు.

కంపనీ తదుపరి యుగాన్ని తీర్చిదిద్దేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని అకిస్ ఎవాంజెలిడిస్ తెలిపారు. టెక్ నివేదికలు పేర్కొన్న స్థాయిలో ఉద్యోగాల తొలగింపులు ఉండబోవని స్పష్టం చేశారు. పరిమిత స్థాయిలోనే ఉద్యోగ కోతలు ఉంటాయని, ప్రభావితమైన సిబ్బందికి అన్ని విధాల అండగా ఉంటామని వెల్లడించారు. మరోవైపు నథింగ్ ఫోన్4(బీ) విక్రయాలు తగ్గినట్టు వస్తున్న వార్తలపై స్పందించారు. విడుదలైన మొదటి రోజే 29,537 యూనిట్లు విక్రయాలు జరిపి, ఆ ధరల సెగ్మెంట్‌లో నథింగ్ ఫోన్4(బీ) రికార్డు సృష్టించిందన్నారు

# బిఎల్ఎలు సమన్వయంతో పనిచేయాలి

### సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి (సింగిడి)** కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో బీఎల్ఏలు, బూత్ సభ్యులతో విస్తృత సమావేశం – ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, పార్టీ బలోపేతంపై కీలక దిశానిర్దేశం కల్వకుర్తి లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని 6 మండలాల బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు), బూత్ కమిటీ సభ్యులు, టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్, పీబీసీ సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్ లతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమావేశంలో పార్టీ బలోపేతం, ఓటరు జాబితా ప్రత్యేక సవ రణ, బూత్ నిర్వహణ, కార్యకర్తల బాధ్యతలు, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించి కీలక దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే కసి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో పార్టీ బలపడితేనే నియోజకవర్గంలో విజయానికి బలమైన పునాది పడుతుందని అన్నారు. బీఎల్ఏలు, బూత్ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవం తంగా నిర్వర్తిస్తూ ప్రతి ఇంటికి చేరుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమో దయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పేర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాలు, తండాలు, వార్డుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి కార్యకర్త పార్టీకి బలమైన ప్రతినిధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకులు, బీఎల్ఏలు, బూత్ సభ్యులు సమష్టిగా పనిచేస్తే కల్వకుర్తి నియోజక వర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుం దన్నారు. సమావేశంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కల్వకుర్తి మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, తలకొండపల్లి మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భట్టు కిషన్ రెడ్డి, పోతుగంటి శంకర్, హరి కిషన్ నాయక్, మున్సిపల్ అధ్యక్షులు అవ్వారి శివలింగం, పుస్తకాల రాహుల్ మరియు పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, బీఎల్ఏలు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పనులను నాణ్యతతో చేపట్టాలి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రతి పనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శ్రద్ధ వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సూచించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం పబ్లిక్ హెల్త్ ఆర్ అండ్ బి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 60 కోట్లతో ప్రారంభమైన పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రతి డివిజన్ కు కోటి రూపాయలు కేటాయించారని త్వరలోనే అన్ని డివిజన్లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిపై సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే నూతన పనులపై ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని సూచించారు.



ప్రధానగా నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముద క్ పల్లి వరకు రూ. 30 కోట్లతో రోడ్డు ప్రతిపాదించామన్నారు అలాగే ఆర్ యూబీ ల నిర్మాణానికి రూ. 60 కోట్లు, నాందేవ్ వాడ వంతెన పొడిగింపునకు రూ. 100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా అమృత్ 2 కింద మంజూరైన యూజీడీ పనుల్లో వేగం పెరిగిందని తెలిపారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, డీఈ యోగేందర్, ఏఈ శంకర్, యూ జీ డీ ప్రాజెక్ట్ మేనేజర్ జయశంకర్, ఆర్ అండ్ బి అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# విఠలేశ్వర ఆలయాలను దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే

**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** ఆషాడ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) పురస్కరించుకుని నగరంలోని నాందేవ్ వాడ, బ్రహ్మపురి లో గల విఠలేశ్వర ఆలయాలను శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనా రాయణ గుప్తా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహావిష్ణువు రూపం విఠలేశ్వ రుడు అన్నారు. ఏకాదశి నుంచి మహావిష్ణువు యోగ నిద్రలోకి ప్రవేశిస్తాడని పురాణాలు చెబుతున్నాయన్నారు. హిందూ సాంప్రదా యంలో తొలి ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఉపవాసం చేసి మహావిష్ణువును ఆరాధిస్తే పాపాలు తొలిగి, ఆయురారోగ్యం, అష్టైశ్వర్యాలు కలుగుతా యని విశ్వాసం అన్నారు. మహారాష్ట్ర లో విఠలేశ్వరుడు, రుక్మిణి దేవి ను అత్యధికంగా కొలుస్తారని,




ఇందూరులోనూ మహారాష్ట్ర సాంప్రదాయం పాటిస్తారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు మల్కాయి మహేందర్, సుధీర్, జగదీష్ కులకర్ణి, నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం




**ఖమ్మం, (సింగిడి)** అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది మానవ అక్రమ రవాణాకి వ్యతిరేకంగా పని చేస్తున్న ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ మరియు డిఆర్డిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఆర్డిఏ రావుల జయశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ఈ మానవ అక్రమ రవాణా గురించి అవగాహనా కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసికెళ్తే వాళ్ళు జాగ్రత్త పడి వారి కుటుంబాలు కూడా ఇలాంటి వాటికీ దూరంగా వుంటారు అని తెలిపారు అంతే కాకుండా గత సంవత్సరం ప్రజ్వల సంస్థ ద్వారా మానవ అక్రమ రవాణా పైన శిక్షణ తీసుకున్న హైస్కూల్ టీచర్స్, అంగన్వాడీ టీచర్స్ మరియు గ్రామ దీపికలు మళ్ళీ వారి ప్రాంతాల్లో ఘనంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టినందుకు వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. డిపిఎం ఆంజనేయులు మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం సన్మానించబడిన వారిని స్ఫూర్తిగా తీస్కొని మన వంతు పాత్రగా మానవ అక్రమ రవాణా నిర్ములనకై కృషి చేయాలనీ తెలిపారు తదుపరి ప్రజ్వల సంస్థ రిసోర్స్ పర్సన్స్ సురేష్ కుమార్,భూపాల్ ఈ సమావేశానికి హాజరైన MS Ob లకు, VOA లకు ఈ మానవ అక్రమ రవాణా పైన వీడియోస్ , PPT ద్వారా అవగాహనా కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో సురేష్ భూపాల్,హరీష్,ఖమ్మం జిల్లా వివిధ మండలాల నుండి MS-OB', SA's, AWT's, VOA's సిబ్బంది పాల్గొన్నారు.

# బోధన్ నియోజకవర్గ బిఆర్ఎస్ సమన్వయ సమావేశం



**బోధన్ ప్రతినిధి, (సింగిడి)** బోధన్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ అమేర్ నివా సంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పార్టీ శ్రేణులు గ్రామాలలో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావ్,సర్ జిల్లా కోఆర్డినేటర్ సుమిత్ర, బిఆర్ఎస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు రవీంద్ర యాదవ్, మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలి

### తెలకపల్లి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ ..అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి.

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ (సింగిడి)** ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ నియో జకవర్గ పరిధిలోని తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల తీరును, వైద్యులు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య అధికారులకు కలెక్టర్ సూచించారు. తనిఖీలో భాగంగా ముందుగా పీహెచ్‌సీలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్, విధుల్లో అందరూ సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల వివరాలు, నమూనాల సేకరణ, పరీక్షల నమోదు, ఫలితాల విడుదల ప్రక్రియపై ఆరా తీశారు. పరీక్షల నివేదికలు సకాలంలో రోగులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందుల నిల్వలను కూడా కలెక్టర్ పరిశీలించారు. సాధారణ రోగాలకు అవసరమైన మందులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కుక్క కాటు, పాము కాటు చికిత్సకు సంబంధించిన మందులు తగినంత నిల్వలో ఉన్నాయా లేదా అని వైద్యులను అడిగి



తెలుసుకున్నారు. అత్యంతవసర పరిస్థితుల్లో అవసరమయ్యే ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, మందుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. చికిత్సతో పాటు రోగుల పట్ల మానవీయ దృక్ప థంతో వ్యవహరించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించి అవసరమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స, మందులు అందేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచిం చారు . ఆయుష్ విభాగం వైద్యుడికి ప్రత్యేక సూచనలు చేసిన కలెక్టర్, ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిపై మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోజు వారీ ఆహారపు అలవాట్లు, పోషకాహారం, వ్యాయా మం, యోగా, మాన సిక ఆరోగ్య పరిరక్షణ,



జీవనశైలి సంబంధిత జాగ్రత్తలపై ప్రతి రోగికి అవగాహన కల్పించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ జర్నల్ ఆసుపత్రికి మైరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్యులు కలెక్టర్ చెప్పారు. రిఫరల్ ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరిగేలా చర్యలు తీసుకో వాలని, రోగులు అనవసరంగా ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ప్రభుత్వ వైద్య సేవలు అందిం చేందుకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి సంతృప్తిగా తిరిగి వెళ్లేలా సేవల నాణ్యతను మరింత మెరుగు పరచాలని, ప్రజలకు అందుబాటులో ఉండి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశిం చారు. కలెక్టర్ వెంట తెలకపల్లి మండలస్థాయి అధికారులు వైద్య సిబ్బంది ఉన్నారు.

# వీరారెడ్డి జయంతి సందర్భంగా.. ప్రశాంత్‌రెడ్డి సేవా కార్యక్రమాలు

**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి)** మరికల్ మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు, మాజీ (ఝాజూదీ) చైర్మన్, మాజీ డీసీసీబీ బ్యాంక్ చైర్మన్, ప్రజానాయకులు కీర్తిశేషులు వీరారెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, నారాయణ పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మరికల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటగా, అనంతరం ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద శ్రీ వీరారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, వీరారెడ్డి ప్రజల కోసం జీవించిన మహోన్నత నాయకుడని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన ఆయన, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఆప్యా యంగా ఆలకించి, వెంటనే పరిష్కరించే నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. అదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ, కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి



తండ్రి ఆశయాలను ఆచరణలో పెడుతూ ప్రజాసేవనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని నాయకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ చైర్మన్ గొల్ల కృష్ణయ్య, మరికల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వీరన్న, మాజీ ఎంపీటీసీ గోపాల్, జిల్లా డీసీసీ కార్యదర్శి వెంకట రాములు చారి, గున్ముకుల ఉప సర్పంచ్ నరసింహ, మరికల్ ఉపసర్పంచ్ అన్వర్, బొంత మౌళి, సలీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరికలు



**ఆర్మూర్ , (సింగిడి)** బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండలానికి చెందిన పలువురు నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శనివారం రోజున బి. ఆర్. ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకు న్నారు. హైదరాబాదులోని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో ఏరుగట్లమండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి వారికి కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. రాష్ట్ర పాలన సైతం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో నమ్మకం కోల్పోవడంతో టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి కేసీఆర్ హయాం లోనే జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై పూర్తిస్థాయిలో అసంతృప్తి నెలకొందన్నారు. తిరిగి కెసిఆర్ ఆధ్వర్యం లోనే రైతులకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు పూర్తి విశ్వాసం ఏర్పడడం వల్ల, తిరిగి టీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నా రని ఆయన అన్నారు. టిఆర్ఎస్ లో చేరిన సమిష్టిగా కృషిచేసి రాబోయే ఎన్నికల్లో, కేసీఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో జుంగాల గంగాధర్ (వార్డ్ మెంబర్ ) జోగు చిన్నయ్య, జుంగాల లక్ష్మణ్, జింగాల పెద్ద గంగారం, ఎం. డి. అన్వర్, బర్మా చిన్న గంగారం, పడిగెల ముత్తన్న, పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుల్లే రాజేశ్వర్, మాజీ ఎంపీపీ, ప్రస్తుత సర్పంచ్ కోల్పాక ఉపేంద్ర, మాజీ ఎంపీటీసీ జక్కాని మధు, సొసైటీ చైర్మన్ బర్మా నరసయ్య, ఈర పట్నం నరసయ్య, ఈర పట్నం నరేష్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ అర్ధిక సహాయంతో సొంతింటి కల సాకారం చేసుకోవాలి..

### లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

### ప్రతి సోమవారం నిర్మాణ దశకు అనుగుణంగా బిల్లులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ

### ఈర్లపూడిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, (సింగిడి)** ఈర్లపూడిలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల కు ప్రభుత్వ అర్ధిక సహాయాన్ని వినియోగించుకొని త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవా లని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. శనివారం ఖమ్మం నియో జకవర్గం రఘునా థపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈర్లపూడి గ్రామంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా సందర్శించి, పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణం లో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను వేగవంతం చేసేలా అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈర్లపూడి గ్రామంలో మొదటి విడుతలో 160 ఇండ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇప్పటివరకు 98 ఇండ్లు పూర్తి అయిన్నాయని, 62 ఇండ్లు వివిధ దశలలో నిర్మాణాలు ఉన్నాయని, ఎక్కవ వరకు గోడల నిర్మాణం పూర్తయి, స్లాబ్ దశలో, నిర్మాణం ఉన్నాయని, లబ్ధిదారులకు నిర్మాణంలో ఏలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పూర్తయిన దశల ప్రకారం ప్రతి సోమవారం బిల్లులను ప్రభుత్వం నేరుగా బ్యాంక్ ఖాతాకు జమచేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఇండ్లు పూర్తి అయిన తర్వాత మొత్తంగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వ అర్ధిక సాయం లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. ఇప్పటికే అర్హులై పునాది స్థాయి వరకు కట్టుకోలేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించామని కలెక్టర్ గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం



లేకుండా రెవెన్యూ, గ్రామపంచాయతీ, హౌసింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులు తమ సొంతింటిలో గృహప్రవేశం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం పేదల గృహ కలను సాకారం చేయడంలో అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యతతో కూడిన శాశ్వత గృహాలను నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, ఎంపీడీవో అశోక్, ఈర్లపూడి సర్పంచ్ గీతా దేవ్ సింగ్, హౌసింగ్ ఏఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన్ రాజనీమా ప్రజాస్వామ్యవాదుల విజయం

**ఖమ్మం, (సింగిడి):** నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు,యువత, ప్రజాస్వామ్యవాదుల విజయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. కాక్రోచ్ సైన్యాన్ని చూసి దేశం గర్వపడుతున్నదని, విద్యార్థులు, యువత ఆగ్రహించి పోరుబాట పడితే,అది ఏ స్థాయిలో ఉంటుందో యావత్ ప్రపంచం మరోసారి చూసిందని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా,బెదిరించినా, భయపెట్టినా, నిర్బంధాలు ప్రయోగించినా, లాఠీలెత్తినా, దేశద్రోహులు,సంఘ విద్రోహులు అని ముద్రవేసినా కూడా యువత వెనుకంజ



వేయకుండా ఉద్యమించడంతో కేంద్రం దిగిరాక తప్పలేదన్నారు. విద్యార్థుల పోరాటంలో న్యాయం ఉందని,ధర్మమైనదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. విద్యార్థుల ధర్మమైన ఆగ్రహావేశా లకు పార్లమెంట్ గేట్లు కూడా మూసేయా ల్సిన పరిస్థితి తలెత్తిందంటే వారి బలమెంతో పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేస్తూ,దేశంలో ఇక ముందు ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా, అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా పాలకులకు హితవు పలికారు.

### రాష్ట్రంలో 4వ స్థానం సాధించిన

# అలంపూర్ ఎస్ ఐ ఆర్

### ఇటిక్యాలలో బిఎల్ఏలతో ప్రత్యేక సమావేశం



**గద్వాల ప్రతినిధి (సింగిడి)** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఇటిక్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ ) కార్యక్రమంపై మండల బి ఎల్ ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్. ఏ. సంపత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సర్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్ కూడా పాల్గొన్నారు. సమావేశానికి ముందు మండల నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, సిద్దేశ్వర్‌లకు శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న నియోజక వర్గాల జాబితాలో అలంపూర్ నియోజకవర్గం 4వ స్థానంలో, ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కార్యా చరణ, సర్ కార్యక్రమం అమలు, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లే విధానం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ప్రతి బూత్‌లో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ అప్పగిం చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం అనుసం ధానంగా ఉండాలని బిఎల్ ఏలకు దిశానిర్దేశం చేశారు. అలాగే, కాంగ్రెస్ అనుకూల ఓటర్లను తొలగించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపిస్తూ, ప్రతి బీ ఎల్ ఏలు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ అనుకూల ఓటర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సర్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్, అలంపూర్ నియోజకవర్గ బి ఎల్ ఏల ఇన్‌చార్జి షేక్షావలి ఆచారి, ఇటిక్యాల మండల అధ్యక్షుడు రుక్మానంద రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగేష్, జిల్లా నాయకులు, వివిధ గ్రామాల బి ఎల్ ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు.

### మహావిష్ణు మూర్తి దర్శనానికి పోటెత్తిన భక్తులు




**కల్వకుర్తి (సింగిడి)** కల్వకుర్తి ప్రాంతంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి లోని శ్రీ మహావిష్ణు ఆలయాలతో పాటు వివిధ విష్ణు ఆలయాలు శని వారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయాల్లో విష్ణు సహస్రనామ పారాయణం, భజనలు, హారతులు, ప్రత్యేక ఆరాధనలు వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ శ్రీ మహావిష్ణువుకు మొక్కులు చెల్లించి కుటుంబ సభ్యుల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు. తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువును దర్శించుకోవడం అత్యంత పుణ్యప్రదమనే విశ్వాసంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తజన సందోహంతో నిండిపోయి, గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల ద్వారా భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం కల్పించడంతో పాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది, వాలంటీర్లు భక్తులకు సహకా రం అందించారు. మొత్తంగా తొలి ఏకాదశి సందర్భంగా కల్వకుర్తి ఆలయాలు భక్తిశ్రద్ధలతో కళకళలాడగా, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# గుండియా వాలియా నాయక్ తండాలో ఎస్ఐఆర్ పూర్తి

**కోడేరు, (సింగిడి)** కోడేరు మండల పరిధిలోని గుండియా వాల్యా నాయక్ తండాలో శనివారం నాటికి ఎస్ ఐ ఆర్ పూర్తి అయ్యిందని గ్రామ సర్పంచ్ శివనాయక్ అన్నారు గుండియా నాయక్ వాలియా తండాలో పోలింగ్ స్టేషన్ 60లో 1032 ఓటర్లకు గాను 921 ఓటర్లను ఆన్లైన్ చేయడం జరిగిందని 30 మంది మరణించిన వారు ఉన్నారని 64 మంది డబుల్ పేర్లు ఉన్నాయని 17 మంది మైగ్రేషన్ వలస పోయారని బి ఎల్ ఓ సద్గుణ అన్నారు ఓటర్ నమోదు ప్రక్రియ సజావుగాజరగడానికి సహకరించిన తండావాసులకు కృతజ్ఞతలు తెలిపారు

# మంత్రి అడ్లూరికి కీలక బాధ్యత...

ఎస్సీ వర్గీకరణ, బిల్లు కీలక కమిటీల్లో స్థానం..



**జగిత్యాల ప్రతినిధి ,(సింగిడి)** తెలంగాణలో సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గ సంకల్పానికి అనుగుణంగా, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను రెండు అత్యంత కీలక కమిటీలలో సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖ జి.ఓ.ఆర్. టి. నెం. 1077ను ప్రభుత్వం జారీ చేసింది. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని సభ్యునిగా చేర్చారు. ఎస్సీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన మంత్రిగా ఆయన అనుభవం కమిటీ నిర్ణయాలకు మరింత బలం చేకూర్చనుంది. అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో కుల, సామాజిక గుర్తింపు ఆధారంగా వివక్షను నిరోధించే లక్ష్యంతో రూపొందిస్తున్న రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక) బిల్లు--2026లి" కు సంబంధించిన శాసన రూపకల్పనపై అధ్యయనం చేసి సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి సభ్యత్వం కల్పించింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా నిలిపిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగబద్ధమైన, న్యాయసమ్మతమైన సిఫారసులు అందించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అలాగే, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎలాంటి వివక్షకు గురికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించే విధంగా రోహిత్ వేముల బిల్లును ఆదర్శవంతమైన శాసనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల అమలుకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆ దిశలో తీసుకుంటున్న ప్రతి నిర్ణయం తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలబెడుతుందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఈ రెండు కీలక కమిటీలలో సభ్యత్వం కల్పించడం ద్వారా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఆయన పాత్ర మరింత బలోపేతం కానుంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయం సాధనలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

# దోపిడీ నిందితులను వారంరోజుల్లో పట్టుకోవాలి

లేకపోతే పోలీసు కమిషనర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరిక

మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ నగరంలో శాంతిభద్రతలు క్షీణించాయని, వరుస దోపిడీలు జరుగుతున్నా పోలీసులు సమర్థంగా స్పందించడం లేదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. భగత్‌నగర్ చౌరస్తాలో ఇటీవల దోపిడీకి గురైన మున్నాభాయ్ కుటుంబాన్ని శనివారం పరామర్శించిన ఆయన, వారం రోజుల్లోగా నిందితులను అరెస్టు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోలీసు కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. జూన్‌లో కారు చోరీపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు సకాలంలో స్పందించలేదని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే అనంతరం జరిగిన భారీ దోపిడీ నివారించవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. కారు చోరీకి పాల్పడిన వారే పథకం ప్రకారం ఇంటిపై దాడి చేసి సుమారు 62 తులాల బంగారం, రూ. 25 లక్షల నగదు దోచుకెళ్లారని తెలిపారు. అనుమానితుల సీసీటీవీ చిత్రాలను అందించినప్పటికీ ఇప్పటివరకు నిందితులను గుర్తించలేదని గంగుల ఆరోపించారు. కరీంనగర్ ఒకప్పుడు సురక్షిత నగరంగా ఉండేదని, ప్రస్తుతం దొంగలకు అడ్డాగా మారిందని ఆయన అన్నారు. గతంలో జరిగిన ప్రముఖ దోపిడీ ఘటనల్లోనూ నిందితులను పూర్తిస్థాయిలో పట్టుకోవడం, దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలపై చూపుతున్న శ్రద్ధను ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణపై కూడా చూపాలని సూచించారు. దొంగలను వెంటనే అరెస్టు చేసి, భయాందోళనలో ఉన్న బాధిత కుటుంబానికి తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కరీంనగర్ టౌన్ సహాయ పోలీసు కమిషనర్‌కు ఫోన్ చేసి కేసు పురోగతిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, నాయకులు సుంకిశాల సంపత్‌రావు, నేతి రవివర్మ, మిడిదొడ్డి నవీన్, జి.పి. స్వామితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పారంభమైన ఎంఆర్ఎఫ్ 'బాలాజీ టైర్ వరల్డ్'

## ఆధునిక టైర్స్ , సర్వీస్ కేంద్రం

**అత్యాధునిక పరికరాలతో వీల్ అలైన్‌మెంట్, బాలెన్సింగ్, టైర్ సేవలు ఒకేచోట**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లోని మంచిర్యాల సర్కిల్‌లో ఎంఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలాజీ టైర్ వరల్డ్ టైర్స్ & సర్వీస్ ఫ్రాంచైజీని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ దక్షిణ భారత విభాగీయ మేనేజర్ ఈశ్వర్ పి. ఇట్యాల్, షోరూం యజమాని కుమారస్వామి, జిల్లా మేనేజర్ జగదీశ్వర్ రావు, కరీంనగర్ ఏరియా మేనేజర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ పి. ఇట్యాల్ మాట్లాడుతూ, జగిత్యాలలో 2018లో మొదట కుమారస్వామి ప్రారంభించిన, బాలాజీ టైర్ వరల్డ్ విజయవంతంగా కొనసాగు తోందని, అదే విధంగా కరీంనగర్ కేంద్రం కూడా ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఎంఆర్ఎఫ్‌కు సుమారు 1,400 షోరూములు ఉన్నవి, ప్రతి అరు వేల కిలోమీటర్లకు ఒకసారి వీల్ అలైన్‌మెంట్ చేయించుకోవడం ద్వారా టైర్ జీవితకాలం సుమారు 25 శాతం పెరుగుతుందని సూచించారు. ఈ కేంద్రంలో దిగుమతి చేసిన అత్యాధునిక యంత్రాలతో వీల్ అలైన్‌మెంట్, వీల్ బాలెన్సింగ్, స్వయంచాలక టైర్ అమరిక, ట్యూబ్‌లెస్ టైర్ మరమ్మతులు, నైట్రోజన్ గాలి నింపే సేవలు అందుబాటులో ఉన్నాయి. వాహనాల సేవల సమయంలో వినియోగదారులు వాతానుకూలిత విశ్రాంతి మందిరంలో సౌకర్యవంతంగా వేచి ఉండే ఏర్పాట్లు చేశారు. చెన్నైలోని ఎంఆర్ఎఫ్ శిక్షణ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణులు సేవలు అందుబాటులో ఉండటం ఈ కేంద్రం ప్రత్యేకతగా నిలుస్తోంది. అలాగే జెడ్ఎల్ఎక్స్, పెర్ఫోంజా వంటి ఎంఆర్ఎఫ్ నాణ్యమైన కారు రేడియల్ టైర్లతో పాటు ఆధునిక టైర్ సేవలను కరీంనగర్ వాహనదారులకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం ..

## ఫెర్టి9కు అంతర్జాతీయ గుర్తింపు


**నీడిల్‌రహిత ఐవీఎఫ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలతో దంపతులకు ఆధునిక ఫెర్టిలిటీ చికిత్సలు**

**ఫెర్టి9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డా. బి.జి.బి. పిళ్లై**



**కరీంనగర్, (సింగిడి)**ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఫెర్టి9 ఫెర్టిలిటీ సెంటర్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్టి9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డా. బి.జి.బి. పిళ్లై మాట్లాడుతూ, ఫెర్టి9 క్లినికల్ బృందం ప్రపంచ ప్రఖ్యాత సదస్సుల్లో పరిశోధనా పత్రాలను సమర్పించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందిందని తెలిపారు. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో అది 1.8, ఆంధ్రప్రదేశ్‌లో 1.7గా నమోదవుతున్నాయన్నారు. జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, ఆలస్య వివాహాలు, ఉద్యోగ పరిస్థితులు, పురుషులు, మహిళల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. అయితే ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదించి అవసర మైన పరీక్షలు, ఆధునిక చికిత్సలు తీసుకుంటే విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయని సూచించారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టి9 తన 11 కేంద్రాల్లో నీడిల్‌రహిత ఐవీఎఫ్ సేవలను ప్రారంభించిందని తెలిపారు. దీని వల్ల రోజువారీ ఇంజెక్షన్లతో కలిగే నొప్పి, ఆందోళన తగ్గుతాయని వివరించారు. అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రజనన ఆరోగ్య పరిశోధనల ద్వారా ఐవీఎఫ్ విజయశాతాన్ని పెంచడంతో పాటు ఇంప్లాంటేషన్ వైఫల్యాలను తగ్గించే దిశగా సంస్థ కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో ఇంప్లాంటేషన్ వైఫల్యాలు, గర్భస్రావ నివారణకు ప్రత్యేక అత్యుత్తమ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల దంపతులకు మరింత ఆధునిక ఫెర్టిలిటీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోని 11 ఫెర్టిలిటీ కేంద్రాల ద్వారా ఫెర్టి9 సంస్థ సేవలు అందిస్తోందని, కరీంనగర్ కేంద్రం అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో వేలాది మంది దంపతులకు తల్లిదండ్రులయ్యే ఆనందాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



**కాటారం, (సింగిడి)** మండలంలో తొలి ఏకాదశి వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు మండలంలోని దామరకుంట గోదావరి తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సమీప దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువును దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు అందించాలి

**ఆస్పత్రి అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ విఫలం**

**బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు.. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బిజెపి నాయకులు**

**జమ్మికుంట, (సింగిడి)** జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి రమేష్ ను అడిగి తెలుసుకున్న బిజెపి నాయకులు. శనివారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని స్థానిక బిజెపి నేతలతో కలిసి వారు సందర్శించారు. ఈ సందర్భంగా రాజు వైద్య సేవల గురించి రోగులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జమ్మికుంట ఆసుపత్రికి డయాలసిస్ సెంటర్ మంజూరు చేసినట్లు ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు దానికి సంబంధించిన వైద్య పరికరాలు రాలేదని, పట్టణంలో 70 మంది వరకు డయాలసిస్ బాధితులు ఉన్నారని, వారు డయాలసిస్ కొరకు హుజురాబాద్, కరీంనగర్



ప్రాంతాలకు వెళ్లి రావడం ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రణవ్ బాబు చొరవ తీసుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, కనీసం నిధులేదు, ప్రజా సమస్యలపై స్పందించడం లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు కోటిన్నర రూపాయల విలువైన వైద్య పరికరాలు అందించారని, పేద రోగులకు ఉపశమనం కలిగిస్తున్నారని ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, టెక్నీషియన్స్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించి ఇరువై నాలుగు గంటలు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఓబీసి అధ్యక్షులు ఆకుల రాజేందర్, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, కసుమల్ల గణపతి, కైలాసకోటి గణేష్, అడువాల శ్రీధర్, కొమ్ము అశోక్, ఆకుల తిరుపతి, పోచయ్య, నసీరుద్దీన్, పుల్లూరి ప్రశాంత్, ఉర్సాటి శంకర్, కొండావర్తి ప్రవీణ్, ముకుందా సుధాకర్, అప్పాల రవిందర్, ఇబ్బి యాదవ్, ఎదులాపురం శ్రీనివాస్, చందా సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి

**జమ్మికుంట, (సింగిడి)**ఏడుకొండల వాడా.. వెంకటేశా..ఓ నారాయణ అంటూ వేలాది మంది భక్తులు తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంవత్సరంలో తొలి పండగ అయిన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలోని వెంకటాద్రి నగర్ లో గల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుండి భక్తుల కోలాహలం తో సందడిగా మారింది. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏదు కొండల వెంకటేశ్వర స్వామికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించగా గతంలో ఎన్నడూ లేని విధంగా వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయానికి వచ్చే



భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా జమ్మికుంట పట్టణంలోని శివాలయం రామాలయం, హనుమాన్ దేవాలయాలు, అయ్యప్ప స్వామి దేవాలయం, పంచముఖ హనుమాన్ దేవాలయం ,బాల ఆభయాంజనేయ స్వామి దేవాలయం, కొత్తపల్లి హనుమాన్ దేవాలయం, అపర భద్రాద్రిగా



ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించగా వందలాదిమంది భక్తులు పాల్గొని పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# నిర్మాణ పనులపై మేయర్ ఆకస్మిక తనిఖీ..

**గడువులోపు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశం.**

**సమీకృత మార్కెట్లు, సమీకృత శిశు అభివృద్ధి భవనం, పార్కింగ్-వాణిజ్య సముదాయం పనులను పరిశీలించిన మేయర్ శ్రీనివాస్**


**కరీంనగర్, (సింగిడి)**నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కరీంనగర్ మేయర్ కోలాగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి నగరంలోని పలు నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ముందుగా పద్మనగర్ సమీకృత కూరగాయలు-మాంసాహార మార్కెట్‌ను సందర్శించిన మేయర్, ఇప్పటికే ప్రారంభమైన ఈ మార్కెట్‌లో పారిశుద్ధ్యం, వినియోగదారుల సౌకర్యాలు, వ్యాపారుల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కాశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించి, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి 30 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే కలెక్టర్ శిబిర



కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను మూడు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. తదుపరి నిర్మాణంలో ఉన్న సమీకృత శిశు అభివృద్ధి సేవల (ఐసీడీఎస్) భవనం, పార్కింగ్, వాణిజ్య సముదాయం పనులను పరిశీలించిన మేయర్, నిర్మాణ నాణ్యతతో పాటు విద్యుత్, తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం, భద్రత, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారులకు మెరుగైన వసతులు, ప్రజలకు విశాలమైన పార్కింగ్, సులభ రాకపోకలకు అనువైన ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక మార్కెట్లు, పార్కింగ్ సదుపాయాలు, వాణిజ్య సముదాయాలు నగరాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్‌రావు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల విజయానికి మద్దతుగా కాంగ్రెస్ క్యాండిల్ ర్యాలీ

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల పోరాటానికి నైతిక విజయం లభించిందని కాంగ్రెస్ నేతల వ్యాఖ్య**



**కరీంనగర్, (సింగిడి)** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో, విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా కరీంనగర్ నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కోర్ట్ చౌక్ నుంచి కార్ఖానాగడ్డలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అమరులైన విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా నేతలు కోరారు. కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉద్యమాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం ప్రజాస్వామ్యానికి, విద్యార్థుల పోరాటాలకు నైతిక విజయమని అన్నారు. రాజీనామా ఆమోదం పొందే వరకు, అలాగే విద్యార్థుల పెండింగ్ డిమాండ్లు నెరవేరే వరకు కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఈ శాంతి ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ... నరేందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉట్కూరు నరేందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు గడ్డం విలాస్‌రెడ్డి, మడుపు మోహన్, మల్లికార్జున రాజేందర్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, కర్ర రాజశేఖర్, పర్వత మల్లేశం, కాంతాల జగన్‌రెడ్డి, సునావత్ భాస్కర్ నాయక్, అబ్దుల్ రెహమాన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో

## ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం

**ఉత్తర తెలంగాణలో తొలి అత్యాధునిక వీర్య విశ్లేషణ పరికరం ప్రారంభం. 'హోప్' కార్యక్రమంతో ఉచిత సలహాలు, ప్రత్యేక రాయితీలు**



**కరీంనగర్, (సింగిడి)** కరీంనగర్‌లోని రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు రూ. 30 లక్షల విలువైన అత్యాధునిక వీర్య విశ్లేషణ పరికరాన్ని రెనే వైద్య సంస్థ అధినేత ప్రొఫెసర్ డా. బంగారి స్వామి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటువంటి పరికరాలు రెండే ఉండగా, ఉత్తర తెలంగాణలో తొలిసారిగా ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం విశేషమని ఆయన తెలిపారు. వైద్యరంగంలోని నూతన సాంకేతికతను ప్రజలకు అందించడంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. సీనియర్ సంతాన నిపుణురాలు డా. బంగారి రజనీ ప్రియ దర్శిని మాట్లాడుతూ, సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ప్రతి నెల మొదటి శుక్రవారం 'హోప్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో తొలి 30 మంది దంపతులకు ఉచితంగా వైద్య సలహాలు అందించి, వారు తెల్పిన వైద్య నివేదికలను పరిశీలించి అన్ని సందేహాలకు సమాధానాలు ఇస్తామని చెప్పారు. ప్రతి దంపతికి సంతాన సాఫల్యం కల్పించడమే తమ బృందం లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జూలై 31 వరకు సుమారు రూ. 5 వేల విలువైన ద్వితీయ అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఏఎంహెచ్ పరీక్ష, వీర్య విశ్లేషణ పరీక్షలను ప్రత్యేక రాయితీతో కేవలం రూ. 1,500కే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దంపతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు డా. సుమ చంద్రిక, డా. భవ్య రెడ్డి, డా. రాజేందర్, డా. నిఖిల్ లక్ష్మణ్, డా. వినాయక్ గౌరిశెట్టి, డా. రవీంద్రాచారి, డా. రాజేంద్ర ప్రసాద్, డా. సుమ, డా. సాయిశ్రీ, డా. సంధ్య, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, బయోమెడికల్ ఇంజినీర్ ఆకాశ్ కొండా, పీఆర్వో మహేశ్ ప్రఫుల్, పరిపాలనా సిబ్బంది స్నేహ భోలి, రమ, నీరజతో పాటు ఆసుపత్రి సిబ్బంది, సుమారు 150 మంది రోగులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న

## అల్ఫోర్స్ సీబీఎస్ఈ క్లస్టర్, ఖోఖో పోటీలు

**క్రీడలు విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందిస్తాయి.. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి)** కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్7 ఖోఖో పోటీలు రెండో రోజూ ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి వివిధ జట్లను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా ఏ పనినైనా ఆసక్తితో, ఆత్మవిశ్వాసంతో చేయడానికి దోహదపడతాయని అన్నారు. ప్రతి మ్యాచ్ ఉత్కంఠగా సాగుతుండగా, విద్యార్థులు అత్యుత్తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. పోటీల్లో అండర్14, అండర్17, అండర్19 విభాగాల్లో పలు రాష్ట్రాల నుంచి పాల్గొన్న జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్14 విభాగంలో శ్రీ ప్రకాష్ కాన్సెప్ట్ స్కూల్ (ఆంధ్రప్రదేశ్), విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ (హైదరాబాద్), సాధు వాసవి ఇంటర్నేషనల్ స్కూల్, బీవీబీ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (నాచారం), శ్రీ విద్యానికేతన్ (మహబూబ్ నగర్), ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఏకశిల హైస్కూల్ (వర్ధన్నపేట) తదితర జట్లు విజయం సాధించాయి. అండర్17 విభాగంలో అక్షర వాగ్దేవి పాఠశాల, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై పాఠశాల, కమల్‌రాణి పాఠశాల, బ్లూమింగ్ పాఠశాల, చిత్రారి పాఠశాల, జీవితా విన్యస పాఠశాల, పల్లవి పాఠశాల, విద్యాభారతి, శ్రీ ప్రకాష్, బీఆర్ఎస్ విజ్ఞాన్‌జ్యోతి, మాంటిసోరి ఎలైట్, శాంతినికేతన్, శ్రీరామ్ యూనివర్సల్, సంఘమిత్ర పాఠశాలల జట్లు విజయాలు నమోదు చేశాయి. అండర్19 విభాగంలో శ్రీ ప్రకాష్ విద్య, పల్లవి పాఠశాల, అక్షర పాఠశాల (నెల్లూరు), హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్లు విజయాలను సొంతం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖోఖో సంఘం రిఫరీల బోర్డు కన్వీనర్ టి. సూర్యప్రకాశ్, అంతర్జాతీయ రిఫరీ రవీందర్, ఖోఖో సంఘం ప్రతినిధులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జట్ల నిర్వాహకులు, శిక్షకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి: బాసర జోన్ డీఐజీ భాస్కరన్

**జగిత్యాల ప్రతినిధి, (సింగిడి)** బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్, శనివారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం (డీపీఓ) తో పాటు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా పోలీస్ గెస్ట్ హౌస్ కి చేరుకున్న డీఐజీ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పరిసరాలు, రికార్డులు, ఎవిడెన్స్, కేసు డైరీలు, సీసీటీఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా నమోదు చేసి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శాస్త్రీయ ఆధారాలతో కేసులను విచారించి కోర్టుల్లో శిక్షల శాతం పెంచే విధంగా పనిచేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ద్వారా ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గా పోలీస్ స్టేషన్ ఆవరణం లో మొక్కను నాటారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న డీఐజీ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న వివిధ విభాగాలను సందర్శించారు. ముఖ్యంగా స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (DCRB)కార్యాలయాలను పరిశీలించి నిర్వహిస్తున్న రికార్డులు, డిజిటల్ డేటా నిర్వహణ, సమాచార సేకరణ విధానం, సాంకేతిక వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ ద్వారా జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించిన సమాచార సేకరణ, ముందస్తు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపించే అసత్య ప్రచారాలు, వదంతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాటిపై వెంటనే



స్పందించాలని ఆదేశించారు. ఐటీ కోర్ విభాగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల ఛేదనలో సాధిస్తున్న పురోగతిని తెలుసుకున్నారు. సీసీటీవీ విశ్లేషణ, డిజిటల్ ఆధారాల సేకరణ, డేటా అనాలిసిస్, సైబర్ నేరాల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డీసీఆర్‌బీ కార్యాలయంలో నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, వారెంట్లు, నిందితుల వివరాలు, నేర విశ్లేషణ సంబంధించిన రికార్డులను



పరిశీలించారు. ప్రతి రికార్డు నవీకరించబడేలా చర్యలు తీసుకోవాలని, డేటా ఖచ్చితత్వాన్ని కాపాడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని డీఐజీ భాస్కరన్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. డీఐజీ వెంట ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# స్టేట్ 2వ ర్యాంక్ సాధించిన విద్యార్థినికి ఘన సత్కారం

## కష్టపడితేనే విజయాలు సాధ్యం మాజీ ఎమ్మెల్యే మెచ్చా



**దమ్మపేట, (సింగిడి):** అశ్వారావుపేట వికేడీవిఎస్ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బై పీ సీ చదువుతున్న దమ్మపేట మండలం నాయుడుపేట గ్రామానికి చెందిన మల్లిశెట్టి రాంబాబు కుమార్తె ధనతేజస్విని ఇంటర్ ఫలితాల్లో 440 కి గాను 438 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు గురువారం విద్యార్థిని నివాసానికెళ్లి అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాలు సాధించగలరని ధనతేజస్విని నిరూపించిందని కొనియాడారు. ఆమె సాధించిన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా కారణమని. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

# కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్

## ప్రాజెక్ట్ అమలుపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్..



**పాలేరు (సింగిడి):** ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలు పై రెవెన్యూ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని అన్నారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ లు అందించే దిశగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ రూపొందించామని అన్నారు. రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత గ్రామంలోని లైసెన్స్ సర్వేయర్ లాగిన్ కు వెళ్తాయని, రెండు రోజుల్లో ఆ రైతు భూమికి సరిహద్దు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని, ఈ వివరాలను సర్వేయర్ సిస్టంలో నమోదు చేశాక దరఖాస్తుదారుడైన రైతు సర్వే మ్యాప్ నకు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని అన్నారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ జనరేట్ చేసి పోర్టల్ లో అప్లోడ్ చేస్తారని ఈ ప్రక్రియలు దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్ మొబైల్ నెంబర్ కు మెసేజ్ వస్తాయని తెలిపారు. పైలట్ ప్రాజెక్టు క్రింద ముందుగా కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూ భారతి కింద ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దారు సైదులు, కలెక్టరేట్ భూ భారతి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేవలం పేరు చేర్పు ఉద్యమం మాత్రమే..

**జాదవ్ రమేష్ నాయక్ లంబాడీల ..**
**ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త**
**కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా కొంచెం**
**ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది...**



**దోర్నకల్ /మరిపెడ (సింగిడి):** మాకుల భావసంగ్ బావా మ్యారమా భవానీ క్షేత్రం గురించి లంబాడీల ఐక్య వేదికఆధ్వర్యం లో జరుగుతున్న ఉద్యమము పేరు మార్పు ఉద్యమం కాదు కేవలం పేరు చేర్పు ఉద్యమం మత్రమే అని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్తఆధ్వర్యం లో లంబాడీల ఐక్య వేదిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసినమీడియా సమావేశంలో తెలపడం జరిగింది. కొన్ని వార్తలు పుకార్లు వలన కొంచెం ఉద్రిక్తత వాతావరణం ఈ సారి మాకులజాతర, మజీర్ హాట్ జాతర, మజ్జి దేవేర్ జాతర జరగడానికి కారణం పుకార్లుమాత్రమే అని కొట్టి పారవేశారు. ఈ రోజు మాకుల జాతర కు కానీ మాకుల గుడి కికానీ లంబాడీలు కేవలం భావసంగ్ బావా ను మొక్కడనికి వస్తారు అలాగే మ్యారమాభవాని నీ మొక్కనికి వస్తారు కావున ఆ పేర్లను ఉన్న పేర్లకు అదనంగాచేర్చాలి. అని మాత్రమే లంబాడీల ఐక్య వేదిక తరుపున పేరు చేర్పు ఉద్యమంచేస్తున్నాము అని తెలియచేశారు. ఇది మార్పు ఉదయం కాదు ఇది కేవలం చేర్పుఉద్యమ మాత్రమే అని విలేకరుల సమావేశం లో చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లోడోర్నకల్ నియోజక వర్గ ఇంచార్జీ ప్రవీణ్ నాయక్ బానోతు, మహబూబాబాద్ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు బాసు నాయక్ గుగులోత్, మరిపెడ మండల జనరల్సెక్రటరీ దేవేందర్ నాయక్, మరిపెడ మండల కార్యదర్శి అశోక్ నాయక్, మరిపెడమండల సాంస్కృతిక కార్యదర్శి ప్రభాకర్ నాయక్,మరిపెడ మండల ఆర్గనైజింగ్సెక్రటరీ నవీన్ నాయక్, మరిపెడ మండల జాయింట్ సెక్రటరీ రాజేష్ నాయక్ భూక్యాతదితరులు పాల్గొన్నారు..

# పట్టణ అభివృద్ధికి ప్రతిపక్షం సహకరించాలి

## మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి






**నిర్మల్ ప్రతినిధి,(సింగిడి):** నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు 15 కోట్లతో పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధిపనుల ప్రతిపాదనను కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. నిర్మల్ మున్సిపల్ పాలక వర్గం ఒక వార్డును అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముందుకు వెల్లడం లేదని, పట్టణాన్ని అభివృద్ధి దిశలో నడిపేందుకు పనిచేస్తుందని అన్నారు. ఉన్న నిధులను వార్డుల అవసరాల ప్రకారం పనులు కేటాయించడం జరుగుతుందని, ప్రతిపక్ష సభ్యులు అవగాహన రహిత పనులు చేయద్దన్నారు . అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లను కల్పుకొని మున్సిపల్ పాలనను కొనసాగిస్తామని, అభివృద్ధికి అడ్డుపడకుండా తమతో కలిసి రావాలని తెలిపారు.

# రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన తూర్పతి జానకి.

**తూర్పతి జానకిని సన్మానించిన కౌన్సిలర్ మీనాక్షి సత్యనారాయణ..**



**చేవెళ్ల (సింగిడి):** : కష్టపడి చదివే గుణం ఉంటే.. పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా అద్భుతాలు సృష్టించవచ్చని తూర్పతి జానకి నిరూపించింది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బైపీసీ (దీఊజ) విభాగంలో జానకి ఏకంగా 440 మార్కులకు గాను 437 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకును సొంతం చేసుకుంది. ఈ అద్భుత ప్రతిభతో తన గ్రామానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చింది. జానకి సాధించిన విజయానికి గుర్తింపుగా, స్థానిక కౌన్సిలర్ కరికే మీనాక్షి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమార్తెను ప్రోత్సహించి, ఈ స్థాయికి చేర్చిన తండ్రి యాదయ్యను కౌన్సిలర్ శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జానకి కుటుంబాన్ని అభినందించారు, మాజీ సర్పంచ్ సామ మాణిక్య రెడ్డి, గ్రామస్తులు సామ విఠల్ రెడ్డి, సాలె శేఖర్, చీర రమేష్, చీర శ్రీనివాస్, సిదిగిద్ద మహిపాల్ రెడ్డి, కరికే మహేందర్, జూలూరి నరేందర్ తదితరులు పాల్గొని జానకి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# గుర్తింపు కోసం తెలంగాణ ఉద్యమకారుల గళం

## చలో హైదరాబాద్'కు పిలుపు.. హామీలు అమలు చేయాలంటూ డిమాండ్



**నల్లబెల్లి, (సింగిడి):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు ఇప్పటికీ ప్రభుత్వ గుర్తింపు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభు త్వం స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్లబెల్లిలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సాంబరావు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. ఉద్యమకారుల అండదండలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారినే నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఈనెల 18నహైదరా బాద్లోని తార్నాకలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంనిర్వహించనున్నట్లు తెలిపారు. మర్రి కృష్ణా రెడ్డి ఫంక్షన్ హాల్లో జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులుహాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికతో పాటు భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల మొండి వైఖరి కొనసాగిస్తే తదుపరి ఆందోళనలకుసిద్ధమవుతామని హెచ్చరించారు. జార్ఖండ్ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రతి ఒక్కరికి ఎకరం భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. అదనంగా, 250 చదరపు గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు, కనీసం రూ.25 వేల పెన్షన్, బస్సు-రైలు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యమకారుల కోసం ప్రత్యేక ఆరోగ్య భీమా పథకాన్ని అమలు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి నాయకులు, జేఏసీ ప్రతినిధులు పలువురు ఉద్యమకారులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉద్యమంలో చేసిన త్యాగాలను గుర్తించి ప్రభుత్వం తగిన గౌరవం ఇవ్వాలని వారు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయ వంతం చేసి తమ హక్కులను సాధించుకుందామని ఉద్యమకారులు పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య

**ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి..**
**ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బడిబాట..**



**సుల్తానాబాద్, (సింగిడి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేట్ కళాశా లలకు దీటుగా మెరుగైన విద్య అందిస్తున్నామని ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గురు వారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి ఆ ధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం బడిబాట కా ర్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండల కేం ద్రంలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యా ర్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ పొందాలని కోరారు. దూరం నుండి వచ్చే విద్యా ర్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు జరు గుతుందని అన్నారు. ఈ సందర్భంగా బడి పాట వాల్ పోస్టర్లను కల్పన, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయు లతో కలిసి ప్రారంభించారు.




# పాలనలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



**నూతనకల్,(సింగిడి):** గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని మండల స్పెషల్ ఆఫీసర్ బాలు నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి పాలనలో భాగంగా మండల స్థాయి సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ..నూతన సర్పంచులు గ్రామ అభివృద్ధికి అధికారుల సమన్వయంతో పనులు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం,నీటి సమస్య,వీధి దీపాలు తదితర సమస్యలపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదేవిధంగా దశలవారీగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందే విధంగా చూడాలని పేర్కొన్నారు. నూతన సర్పంచ్ లో గ్రామ సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు. తదనంతరం సర్పంచ్ లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత,తాసిల్దార్ శ్రీనివాసరావు,సీఐ నరసింహరావు,ఎంపీవో శశికళ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి,వైద్యాధికారి ఆశ్రిత రెడ్డి,అంగన్వాడి సూపర్వైజర్ పద్మ,వివిధ శాఖ అధికారులు, గ్రామాల సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి,

## సంక్షేమ పథకాలు సమర్ధంగా అమలు... కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్





**కల్వకుర్తి (సింగిడి):** వంగూరు మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర ఏర్పాటు చేసిన మండల సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అవసరాల ఆధారంగానే సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు రూపుదిద్దు కుంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, గ్రామీణ అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. మండల సభలు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వేదికలుగా మారుతున్నాయని, ఆయా శాఖల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం మరియు రాయితీ గ్యాస్, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. అలాగే మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార అవకాశాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యా రంగంలో కూడా ప్రభుత్వం కొత్త కార్యక్రమాలను ప్రవేశపెడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే పథకాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలో గృహ ప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజలు అభివృద్ధి పనులకు సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ, గ్రామ సర్పంచ్ యాదయ్య,ఎంపిడిఓ, ఎమ్మార్వో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ప్రతిభను చాటిన విద్యార్థినికి ఘన సన్మానం



**సుల్తానాబాద్, (సింగిడి):** స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన భూపతిపూర్ కస్తూ రిబా గాంధీ విద్యాలయం ఇంట ర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థిని బట్టు సౌమ్యకి ఘన సన్మానం చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సుల్తానాబాద్ లో జరిగిన మండల స్థాయి సమావేశం లో ఇంటర్మీడియట్ సెకండియర్ ఫలితాలలో రాష్ట్రస్థా యి ప్రథమ ర్యాంకు పొందిన సుల్తానాబాద్ మం డలం భూపతిపూర్ కస్తూర్బా గాంధీ బాలిక వి ద్యాలయం విద్యార్థిని బట్టు సౌమ్య (994/1000) మార్కులు సాధించగా, గురువారం శాలువా, మె మొంటో తో జిల్లా, మండల స్థాయి ప్రజా ప్రతినిధు లు, అధికారులు ఘనంగా సన్మానించారు. కస్తూ ర్బా గాంధీ బాలిక విద్యాలయం సుల్తానాబాద్ మండలం గ్రామీణ ప్రాంతం నుండి చదువుకుని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందని. ఇలాంటి మరిన్ని ఫలితాలు కేజీబీవీ నుండి రావాలని, విద్యార్థులను ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందే విధంగా చేయాలని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలియజేయడం జరిగింది. పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన సౌమ్యను అందరూ స్టూడెం ట్స్ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, తహసిల్దార్ బషీరుద్దీన్, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, డిప్పీవో దేవికా దేవి, ఎంఈఓ రాజయ్య, సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ చంద్రకుమార్, కస్తూర్బా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ మోతే స్వప్న, భూపతిపూర్ సర్పంచ్ చిన్నయ్య, తో పాటు పలు గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం పదార్థాలను ప్రదర్శించిన అంగన్వాడీ కార్యకర్తలు






**ఆర్మూర్, (సింగిడి):** బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ రైతు వేదిక సంఘం భవనంలో గురువారం రోజున ప్రజా పాలన-ప్రజా ప్రణాళిక గ్రామ సభ సజావుగా జరిగింది. గ్రామసభ అనంతరం మోర్తాడ్ గ్రామానికి చెందిన ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు అంగారి జ్యోతి, అంగన్వాడి కార్యకర్తలు చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు అందించే పౌష్టికాహారం పదార్థాలను ప్రదర్శించారు. అంగన్వాడి కార్యకర్తలు తయారుచేసిన పౌష్టికారా లను మోర్తాడ్ మండల ప్రత్యేక అధికారి బండారి శ్రీనివాస్, తాసిల్దార్ చిలుక కృష్ణ, ఎంపీడీవో, తిరుమల, ఎస్సై, బి. రాము,ఎంపీఓ,శ్రీధర్, వివిధ శాఖల అధికారులు అంగన్వాడీ కార్యకర్తలు తయారుచేసిన పత్రిక పోషకహారాలను, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాలను అందిస్తున్నామని అధికారులకు ప్రదర్శించి చూపించడం జరిగింది. దీంతో మండల అధికారులు అంగన్వాడి కార్యకర్తలు పౌష్టిక ఆహారం అందించే పదార్థాలను తిలకించి అంగన్వాడి కార్యకర్తలను అభినందించారు. అనంతరం అంగన్వాడి కార్యకర్తలు తయారుచేసిన నాణ్యతతో కూడిన పౌష్టిక ఆహారాలను, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాలను మండల సర్పంచులు, ఉప సర్పంచ్లు తిలకించి, అంగన్వాడి కార్యకర్తలు చేస్తున్న సేవలను అభినందించారు.

# తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలి

**బీఆరఎస్ జిల్లా నాయకుడు సంకుబాపన అనుదీప్ డిమాండ్**



**కొత్తగూడెం, (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ అవమానకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆరఎస్ జిల్లా నాయకుడు సంకుబాపన అనుదీప్ డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటం, వేలాది మంది అమరవీరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. అలాంటి పవిత్ర పోరాటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత అవివేకం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆయన తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్లో తెలంగాణపై ఇలాంటి వ్యాఖ్యలు వచ్చినప్పటికీ, తెలంగాణకు చెందిన ఎంపిలు మౌనంగా ఉండడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. రాష్ట్ర గౌరవాన్ని కాపాడే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, అలాంటి సమయంలో మౌనం అనేది తెలంగాణ ప్రజల భావోద్వేగాలను అవమానించడమేనన్నారు. బీజేపీ పార్టీ నాయకులు పదేపదే తెలంగాణపై వ్యతిరేక భావజాలాన్ని వ్యక్తం చేస్తూ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీజేపీ పార్టీ కూడా స్పష్టమైన వైఖరి ప్రకటించి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సంకుబాపన అనుదీప్ డిమాండ్ చేశారు.

ప్రభాతవర సింగిడి ప్రతి రంగూ ఓ నిజం

Singidi

సోమవారం 27-7-2026

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమావేశం





**భీమదేవరపల్లి (సింగిడి):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని శ్రీ సాయి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎంపీడీవో వీరేశం అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశం సందర్భంగా గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి పథకాల ప్రయోజనాలు అందేలా గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశం ద్వారా గ్రామాల అభివృద్ధి దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వం లక్ష్యాలను సాధించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

## మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# అడ్మిషన్ల సందడి

### దోస్త్ నోటిఫికేషన్ విడుదల
### కళాశాలలో ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం
### విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
### ప్రిన్సిపాల్ డాక్టర్ టి. పెద్దన్న వెల్లడి



**ఆర్మూర్, (సింగిడి):** రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ప్రవేశాల కోసం 'దోస్త్' నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. పెద్దన్న తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడిం చారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, మోర్తాడ్ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొ న్నారు. కళాశాలలో నూతన భవన వసతితో పాటు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక సైన్స్,కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అన్ని కోర్సులను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధిస్తున్నామని, సుమారు 20 ఏళ్ల అనుభవంతో పాటు చీజు, రాజు,గ్రాష్ట్ర.ణ. వంటి ఉన్నత అర్హతలు కలిగిన అధ్యాపక బృందం ఇక్కడ ఉందని వివరించారు.మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మెండోరా, వేల్పూర్, భీమ్గల్, ముప్కాల్ , బాల్కొండ, ఆర్మూర్ మండలాల పరిధిలోని విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలోనే ఉచితంగా ఆన్‌లైన్ దోస్త్రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ప్రకటించారు. రేపటి నుండి కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది బృందాలుగా విడిపోయి పరిసర ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తారని, విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు డిగ్రీ అడ్మిషన్లపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

**ప్రవేశాల గడువు...**

మొదటి విడత: ఏప్రిల్ 15 నుండి మే 07 వరకు.రెండవ విడత: మే 15 నుండి మే 23 వరకు. మూడవ విడత: మే 31 నుండి జూన్ 15 వరకు.అర్హులైన విద్యార్థులు సకాలంలో దరఖాస్తు చేసుకుని, ప్రభుత్వ కళాశాలలోని సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# అరైవ్ అలైవ్'లో భాగంగా ఉచిత కంటి శిబిరం

## మైనర్లు వాహనాలు నడపడం నేరం





**కోహెడ, (సింగిడి):**రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా కోహెడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో వాహనదారులు పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు.అనుభవజ్ఞులైన నేత్ర వైద్య నిపుణులు అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన వారికి పోలీసు అధికారులు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన కంటి చూపు ఎంత ముఖ్యమో, దాని ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో వివరించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. శారీరక ఫిట్‌నెస్‌తో పాటు కంటి చూపు మెరుగుపడితే ప్రమాదాల రేటును తగ్గించవచ్చని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మోటార్ వాహన చట్టం ప్రకారం మైనర్లు వాహనాలు నడపడం నేరమని, అలాంటి సందర్భాల్లో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లతో రహదారి భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

# వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి



**చింతపల్లి, (సింగిడి):**మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక (99 రోజులు) మండల స్థాయి సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. మండల ప్రత్యేక అధికారి ద్వారక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. వేసవి కాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు ప్రత్యేక అధికారి ద్వారక్ సూచించారు. ప్రతి గ్రామంలో నీటి వనరుల పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే ట్యాంకర్లు, బోరు బావులు, మోటార్లు తదితర సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటి సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, ఉపాధి హామీ పనుల పురోగతి, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై కూడా అధికారులు, ప్రజాప్రతి నిధులతో కలిసి విస్తృతంగా చర్చించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో సుజాత, తహసిల్దార్ పందల విజయలక్ష్మి , ఎంపీఓ ఇందూజ , డాక్టర్ శ్రీదేవి , డాక్టర్ వంశీకృష్ణ, సిడిపిఓ సక్కుబాయి,ఎస్ఐ రామ్మూర్తి, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ కుమారి ,ఎంఈఓ నీరుడు అంజయ్య,తదితర మండల స్థాయి అధికారులు, గౌరవ సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# హెల్మెట్ లేకపోతే... పోలీస్ స్టేషన్‌లో నోఎంట్రీ



**మంచిర్యాల, (సింగిడి):** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారులు, పోలీస్ సిబ్బంది స్టేషన్లోకి ప్రవేశం లేదని మంచిర్యాల డిసిపి భాస్కర్ పేర్కొన్నారు. గురువారం అర్రైవ్ అలైవ్ లో భాగంగా మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో నో హెల్మెట్ -- నో ఎంట్రీ కార్యక్రమం అమలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతను పెంపొందించేందుకు మరియు హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో 'నో హెల్మెట్ -- నో ఎంట్రీ' కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. డీసీపీ కార్యాలయానికి, మంచిర్యాల జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో పనిచేసే సిబ్బంది హెల్మెట్ లేకుం డా వస్తే ఆవరణలోకి అనుమతించబ డరని స్పష్టం చేశారు. హెల్మెట్ వినియోగం కేవలం చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా, వ్యక్తిగత భద్రతకు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా హెల్మెట్ వినియోగంపై కఠిన నియంత్రణలు అమలు చేస్తూ, ప్రజల్లో రోడ్డు భద్రతపై బాధ్యతాయుత దృక్పథం పెంపొందించడం లక్ష్యంగా పోలీస్ శాఖ చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని అధికారుల పిలుపునిచ్చారు.

## కాగజ్‌నగర్ పోలీస్ ఆధ్వర్యంలో

# ఐ క్యాంప్

### 50 మంది డ్రైవర్లకు పరీక్షలు



**కాగజ్ నగర్ (సింగిడి)::** కాగజ్‌నగర్‌రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా సాగుతున్న అరైవ్ అలైవ్ ప్రచారంలో భాగంగా కాగజ్‌నగర్ గ్రామీణ పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు స్థానిక వెంకటేశ్వర కంటి ఆసుపత్రిలో జరిగిన ఈ శిబిరంలో 50 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వహిఉద్దీన్ రూరల్ సీఐ కుమారస్వామి ఎస్సై లు పాల్గొని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్ల కంటి చూపు మెరుగ్గా ఉంటేనే ప్రమాదాలను అరికట్టవచ్చని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకో వాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

# నిలువెత్తు నిర్లక్ష్యం



**మంచిర్యాల, (సింగిడి):**మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ దొరగారి పల్లెలో రోడ్డుపైనే విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. సిసి రోడ్డు వేసినప్పుడు స్తంభాన్ని తొలగించాలి. అలా తొలగించకపోవడంతో ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న స్తంభాన్ని తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

# మండల స్థాయి సమావేశం.



**మధిర, (సింగిడి):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం గురువారం ఉదయం మధిర శ్రీరస్తు శుభమస్తు కళ్యాణ మండపంలో నిర్వహిం చడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అధికారిగా మధిర మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గా వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో మధిర మండల తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, మండల విద్యాధికారి, పోలీస్ శాఖ అధికారులు, గృహ నిర్మాణం అసిస్టెంట్ ఇంజనీర్, మధిర ఏఎంసి చైర్మన్,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుత పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ హౌసెస్, మహాలక్ష్మి(ఉచిత బస్సు), గృహజ్యోతి, సన్న రకం వరి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్, మహిళా శక్తి-బ్యాంకు లింకేజ్, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు ఈ పథకాల గురించి సంబంధిత అధికారులు ప్రజలకు వివరించడం జరిగింది. అలాగే రాబోయే పథకాలు అల్పాహార పథకం, కుటుంబ జీవిత బీమా, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనం, వికలాంగ విద్యార్థులకు వాహనాలు, పంటల మార్పిడి, సేంద్రీయ వ్యవసాయం పథకాల గురించి ప్రజలందరికీ వివరించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయమునకు సంబంధించిన సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, పోలీసు శాఖ సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, మండల ప్రజలు పాల్గొనడం జరిగింది.

## నేడు చిన్నకోడూరులో

# ఉచిత కంటి పరీక్ష శిబిరం

### ముఖ్యఅతిథిగా యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి

సిద్దిపేట **(సింగిడి):** నేడు సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో కుండే తిరుపతి (బీరన్న) ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు నిర్వాహకులు కుండే తిరుపతి (బీరన్న) ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని చిన్నకోడూరు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి హాజరుకానునట్లు తెలిపారు

# యాపర్లలో బీఆర్ఎస్ సీనియర్ నేత గుడ్ల చిన్న నర్సింహాకు ఘన నివాళులు

యాపర్లలో బీఆర్ఎస్ సీనియర్ నేత గుడ్ల చిన్న నర్సింహాకు ఘన నివాళులు



**పెబ్బేరు (సింగిడి):**వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం, యాపర్ల గ్రామం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్ల చిన్న నర్సింహా పార్థివ దేహానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాడె మోయడంతో తమ గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సింహాతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి నర్సింహా తన వెన్నంటే నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ సాధిం చిన తరువాత ఆయనను మరింత ఉన్నత స్థాయిలో చూడాలనుకున్నప్పటికీ, ఆరోగ్యం సహకరించక ఆ అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మం డల అధ్యక్షులు వనం రాములు, వెంకటస్వామి, ముఖ్యనాయకులు కర్రె స్వామి, రాజశేఖర్, వెంకటేష్, సాయి, గోపి, బాబు, వీరస్వామి, వడ్డె రమేష్, మాధవ రెడ్డి, పాతపల్లి గోవిందు, కొండల్ రామకృష్ణ, గ్రామ నాయకులు ఆనంద్, అల్లిపిర్ బిసన్న తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



**కొత్తగూడెం, (సింగిడి):**కు ఎస్సీ హోదా కల్పించా లని డిమాండ్ చేస్తూ మండల స్థాయిలో క్రైస్తవ పాస్టర్లు, సేవకులు, విశ్వాసులు ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. 2023 కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరారు. ఎస్సీ హోదా లేకపోవడం వల్ల విద్యా, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఏ కులానికి చెందిన వారైనా ఏ మతంలోకైనా మారవచ్చు కానీ ఎస్సీ కులానికి చెందిన వారు మాత్రం క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సి హోదాను కోల్పోవడం రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు వ్యతిరేకమే కాకుండా ఎస్సి వరాలపై వివక్షకు నిదర్శనమని అన్నారు. మతం మారిన కారణంగా తమ హక్కులు కోల్పోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు సి.హెచ్. శామ్యూల్, కార్యదర్శి పాస్టర్ నాని మోజెస్, సభ్యులు సదానందం, చంద్రమౌళి, యోసేపు, ప్రమోద్, సందీప్, నెహెమ్యా, వేణుగోపాల్, క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే భవిష్యత్



### బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు ఫలితాల్లో. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి బీసీ సంక్షేమ సంఘం. ఆధ్వర్యంలో సన్మానం

**నిర్మల్ ప్రతినిధి (సింగిడి)::** చదువుతోనే అన్ని రంగాల్లో ముందుకు సాగుతారని వ్యక్తిని శక్తిగా మార్చే ఉన్న ఏకైక అస్త్రం విద్యాఅని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు అన్నారు గురువారం ఇటీవల విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో 1000 మార్కులకు గాను 993మార్కులు సాధించిన విద్యార్థిని బిజ్జారపు శ్రీ హర్ష బై పి సి విభాగంలో 1000 మార్కులకు 993 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిచింది, అంతేకాకుండా కాలేజీ టాపర్ గా స్థానం సంపాదిం చుకుంది ఈ చిన్నారి. బిజ్జారపుశేషగిరిరాజు,సృజన దంపతుల విద్యార్థిని నా= బాలికల కళాశాల నిర్మల్ చదువుకోవడం చాలా సంతోషమని ఆయన అన్నారు ఈ సందర్భంగా విద్యార్థిని బీసి సంక్షేమ సంఘం నాయకులు శాలువతో సత్కరించి సావిత్రి భాయి పులే చిత్రపటాని ఇచ్చి సన్మానించారు ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా "బీసీ సంక్షేమ సంఘం" జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మర్కంటి జీవన్. జిల్లా కో కన్వీనర్లు కత్రోజు. అశోక్ చారి,సిరికొండ రమేష్, జింక లక్ష్మీనారాయణ కొత్తూరు కిషన్, అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, గోనె,రాజు, కిరణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం:



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** పట్టణంలోని దీక్ష డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్య సర్వ సభ్య సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించినటువంటి ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించి, సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షుడిగా డాక్టర్ అఖిల సింగ్, కార్యదర్శిగా కే. లక్ష్మణ్, కోశాధికారిగా సిహెచ్. వెంకటరెడ్డి, జాయింట్ సెక్రెటరీ సతీష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా శ్రీధర్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ ను వెంటనే ప్రభుత్వం నుంచి విడుదల చేయడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి దోస్తు ద్వారా జరగబోయేటటువంటి అడ్మిషన్లు పిల్లలకు సంబందించిన ట్యూషన్ ఫీజు వాళ్ళ అకౌంట్లో పడుతున్న సందర్భంగా, ఫీజులను నేరుగా పిల్లలనుండి తీసుకొని అడ్మిషన్ చేయవలసిందిగా,ఇది అందరూ గమనించవలసిందిగా కూడా ఈ సందర్భంగా సభ్యులు ఏకగ్రీవంగా తెలియజేశారు. ఈ సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ ప్రమోద్ రావు, సాయిలు, ప్రవీన్ మరియు వివిధ కళాశాలకు సంబంధించినటువంటి యాజమాన్య సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలను పాటించండి జీవితాలను కాపాడండి: మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి.



**నిర్మల్ ప్రతినిధి,(సింగిడి):** రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాల్లో కౌన్సిలర్ లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు., ఓవర్ టేక్ చేయకూడదని, ప్రతి వాహన దారుడు లెఫ్ట్ సైడ్ లోనే వాహనం నడపాలని, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం వంటివి తప్పనిసరిగా పాటించాలని ఎఎస్పీ ఉపేందర్ రెడ్డి, పట్టణ సిఐ సమ్మయ్య వివరించారు . మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రజా సంరక్షణ కే ప్రభుత్వాలు నిభంధనలు అమలు చేస్తుందని ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. రెండు వాహనాలకు ప్రమాదం జరిగినప్పుడు ఎటువైపు వారికి ప్రాణహాని కలిగిన ఆ కుటుంబం విశాదంలో ఉంటుందన్నారు. అందుకే మున్సిపల్ కౌన్సిలర్ సైతం బాధ్యతగా తమ వార్డుల్లో ప్రమాదాల నివారణకై రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన కలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ టౌన్ ఎస్సై అజయ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులు అన్నిరంగాల్లో

# రాణించాలి

### ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిర్మల్ (వీజూచీ) జిల్లా నాయకుల వెల్లడి



**నిర్మల్ ప్రతినిధి,(సింగిడి):** వెనుకబడిన కులాలలో జనాభాపరంగా అధిక సంఖ్యలో ఉన్న ముదిరాజులు, ఉద్యోగాలపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా మరియు సామాజికంగా వెనుకబడి ఉండడం ఆందోళన కలిగించే విషయమని, ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి రఘునాథ్, దర్శనం దేవేందర్ లు పేర్కొన్నారు. స్థానిక టీఎన్జీవో భవన్ లో, ఈ మధ్యకాలంలో డాక్టరేట్ పట్టాలు పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు , వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యులుగా బాధ్యతలు స్వీకరించిన నాయకులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, వారిని ఘనంగా సత్కరించారు. ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహం లభించనప్పటికీ, ముదిరాజులు స్వశక్తితో పలు రంగాల్లో రాణిస్తున్నారని, అలాంటి వారిని మరింత ప్రోత్సహించి, వారి అభివృద్ధికి చేయుతనశీదించడానికి ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ముందుండాలని వారు ఆకాంక్షించారు. నిర్మల్ జిల్లా ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొత్తపల్లి రఘునాథ్, పవన్ కుమార్, దర్శనం దేవేందర్ మరియు గోనెల శశిరాజ్ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోలాపూర్ రాజేశ్వర్, మొగిలి రాములు, పందెన లక్ష్మణ్ ,శ్రీనివాస్, హనుమాశీడ్లు, పురుషోత్తం, మోహన్, శ్రీధర్, రవి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుమార్తె వివాహం కోసం

# ఆర్థిక సహాయం

### అయిజ స్నేహ బంధు కమిటీ సభ్యులు దాతృతం



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987 - 88 పదవ తరగతి చదివినటువంటి విద్యార్థిని, విద్యార్థులు ఆనాటి చిన్ననాటి స్నేహితులైనటువంటి కీర్తిశేషులు కంసలి లక్ష్మీనారాయణ కుమార్తె వినీల వివాహానికి మిత్రులు అందరూ కలిసి సుమారు 1 లక్ష 53,314 ఆర్థిక సాయం అందించడం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు తండ్రి స్నేహితులు ఒకేసారి ఇంటికి రావడంతో సంతోషం వ్యక్తం చేశారు వారి కళ్ళల్లో ఆనందం కనిపించింది ఈ సందర్భంగా స్నేహబంధు కమిటీ సభ్యులు మాట్లాడుతూ దీన్ని స్ఫూర్తి గా తీసుకొని మిగతా బ్యాచ్ వారు కూడా ఆర్థికంగా ఇబ్బంది వున్న మిత్రుల కుటుంబాలకు సహాయం చేయాలని వారు కోరారు.



# సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు పెరగాలి

## మాళవిక మోహనన్

వెండితెరపై మహిళా పాత్రల్లో నిజమైన మార్పు రావాలంటే కేవలం నటీమణులు మారితే సరిపోదని, సినీ పరిశ్రమలోని ఇతర విభాగాల్లో మహిళల సంఖ్య పెరగాలని నటి మాళవిక మోహనన్ అన్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. హాలీవుడ్ యాక్షన్ చిత్రం 'కిల్ బిల్' తరహాలో నటించాలన్న తన కలను ఆమె తాజాగా బయటపెట్టారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. కమర్షియల్ సినిమాల్లో మహిళలకు విభిన్నమైన పాత్రలు రాకపోవడానికి ప్రధాన కారణాన్ని పేర్కొన్నారు.

"వాస్తవానికి సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు, రచయిత్రులు చాలా తక్కువ. వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. సినిమాల్లో ఫిమేల్ గేజ్ మరింత పెరగాల్సిన అవసరం ఉంది. మహిళా మేకర్స్ పెరిగినప్పుడే, అద్భుతమైన యాక్షన్ పాత్రలు పుట్టుకొస్తాయి. అప్పుడు మన దేశంలోనూ 'కిల్ బిల్'లాంటి సినిమాలు వస్తాయి. మహిళల కోణంలో సాగే కథలకు కిరణ్ రావ్ దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్' ఓ చక్కటి ఉదాహరణ. ఆ సినిమాతో పాటు, అందులోని మహిళా పాత్రలను తీర్చిదిద్దిన విధానం నన్ను బాగా ఆకట్టుకుంది. మహిళా దర్శకురాలి కోణంలో ఆ పాత్రలను చూడడం ఎంతో సంతోషంగా ఉంది" అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం, మాళవిక మోహనన్ ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. హీరో కార్తీ సరసన 'సర్దార్ 2'లో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నావెల్' అనే సినిమాలోనూ ఆమె సందడి చేయనున్నారు.

Rakul Preet Singh



# ఆత్మకథ రాయనున్న సూపర్‌స్టార్.. సినిమాగా కూడా రానుందా?



సూపర్‌స్టార్ రజనీకాంత్‌అ భిమానులకు ఓ శుభవార్త. ఆయన తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారని నెట్టింట వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఆయన బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా, రజనీకాంత్ కొంతకాలంగా ఈ పుస్తకం రాసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. కేవలం పుస్తకమే కాకుండా, ఈ ఆత్మకథను సినిమాగా (బయోపిక్) కూడా తీసుకురావాలని ఆయన భావిస్తున్నారట. ఈ ఆలోచనపై తనకు అత్యంత సన్నిహితులైన వారితో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, పుస్తకం లేదా సినిమాపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

'బేబి'కంటే గొప్పగా చెన్నై లవ్‌స్టోరీ

ఇక, రజనీకాంత్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'జైలర్ 2' చిత్రంలో ఆయన నటిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 15న విడుదల కానుంది. ప్రస్తుతం 'ధర్మన్' మూవీ షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు.

సినిమా సింగిడి
Cinma Singidi

సోమవారం
27-7-2026

# కారు కొనుక్కోవడానికే సినిమాల్లోకి వచ్చా..

కారు కొనాలనే కోరికతో నటించిన తొలి సినిమానే తనని ఈ రోజు కెమెరా ముందు నిలబెట్టిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల 'రైజింగ్ భారత్ సమ్మిట్'లో పాల్గొన్న ఆమె ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించడం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. "నేను కాలేజీలో చదువుతున్నప్పుడే అనుకోకుండా కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి నాకొక అవకాశం వచ్చింది. ఎవరో కొంతమంది నా ఫొటోలు చూసి మా నాన్నని కలిశారు. ఓ సినిమాలో నటించేందుకు నన్ను తీసుకుంటామని అడిగారు. అప్పుడు నాకేం చెప్పాలో అర్థం కాలేదు. సినిమాలపై అప్పుడంతగా అవగాహన లేదు. కానీ, వాళ్లు ఆ సినిమాకు నాకు రూ. 5 లక్షల పారితోషికం ఇస్తామన్నారు. వాటితో కారు కొనుక్కోవాలి.. నా స్నేహితులందరిలో కారు ఉన్న మొదటి అమ్మాయిని నేనే అవుతానన్న ఒకే ఒక్క కారణంతో ఆ సినిమా చేయడానికి అంగీకరించాను.
40 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నాను. అప్పుడే గ్రహించా కెమెరా ముందు ఉండడం నాకు ఎంతగానో ఇష్టమని. ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తర్వాత నటనలోకి రావాలని నిర్ణయించుకున్నా. అందుకే కొంత విరామం తీసుకుని 2013లో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. ఎవరి ప్రమేయం లేకుండానే ఇండస్ట్రీలో అడుగుపెట్టాను. నాకు నేనుగా అన్నీ నేర్చుకున్నా. ప్రారంభంలో చదువు కారణంగా కొన్ని పెద్ద సినిమాల్ని వదులుకోవల్సి వచ్చింది"అని అంది రకుల్. 2009లో కన్నడ చిత్రం 'గిల్లీ'తో వెండితెరకు పరిచయమైన ఆమె తిరిగి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'(2013)తో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది. ఇప్పుడామె త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న హిందీ చిత్రం 'రామాయణ'లో శూర్పణఖగా కనిపించనుంది.

రకుల్ ప్రీత్‌సింగ్

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090